ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
గురువారం 6 మార్చి 2025



5



కొమ్మాలపాటిని ఎమ్మెల్సీ వరించేనా!
● అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే పేరు ● ఆశావహుల్లో జంగా సహా మరికొందరు నేతలు
8

పంది కొక్కుల దాడిలో శిశువు మృతి
గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
6

బియ్యంతో సరి



రేషన్‌లో కోతలే కోతలు

- కందిపప్పు సహా సరుకుల పంపిణీ బంద్
- ప్రభుత్వ తీరుపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తి
- బహిరంగ మార్కెట్‌లో మండుతున్న కందిపప్పు, నూనెలు

రేషన్ అంటే.. బియ్యంతో సరిపెడుతున్నారు. గతంలో కందిపప్పు, జొన్నలు, రాగులు, గోధుమ పిండితో పాటు బహిరంగ మార్కెట్‌లో ఆకాశాన్నంటేలా ఉండే నిత్యావసరాలను సబ్సిడీపై సరఫరా చేసేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ వ్యవస్థలో విపరీత మార్పులు తేవడంతో పాటు సరుకుల్లో కోతలు పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలుత గత టీడీపీ హయాంలో ఇచ్చినట్లుగా సరుకులను కార్డుదారులకు అందించారు. ఆ తర్వాత యథావిధిగా రేషన్ అంటే ఒక్క బియ్యం అన్నట్లుగా మార్చేశారు. పంచదార ఇస్తున్నా అది అందరికీ అందడం గగనమవుతోంది.



(గుంటూరు, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఏ నెలకానెల రేషన్ సరుకుల్లో మార్పులు తెస్తామని చెప్తున్నా అది ప్రకటనలకే పరిమితమవుతోంది. రేషన్ సరుకుల్లో కొత విధిస్తూ వస్తున్న ప్రభుత్వం ఈ నెల కూడా బియ్యం.. పంచదారకే పరిమితం చేసింది. కార్డుదారులకు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీ కందిపప్పు సరఫరాను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించినా అది కొన్ని నెలలకే పరిమితమైంది. కందిపప్పు.. సరఫరా పూర్తిగా నిలిపేయడంపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌లో సరుకుల కోతతో పేదలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం గతంలో రాయితీపై కందిపప్పు కిలో రూ.67కు ఇచ్చేది. ఈ క్రమంలో రాయితీపై పంపిణీ చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని కార్డుదారులు విమర్శిస్తున్నారు. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను దారుణంగా దెబ్బ తీసింది. పౌర సరఫరాల వ్యవస్థ మొత్తం గడిచిన ఐదేళ్లలో నిర్వీర్యమై పోయింది. కూటమి ప్రభుత్వం రాకతో పరిస్థితి మారుతుందని, గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, రాగులు, శనగలు అందుతాయని నిరుపేదలు ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలినాళ్లలో ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు చేసినా అది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. కంది పప్పు, రాగులు, జొన్నల నిల్వలు సరఫరా లేకపోవడంతో వాటి సరఫరాలో ఆటంకాలు తలెత్తుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరుకుల రవాణాలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి, తక్షణ ప్రాతి పదికన కందిపప్పు, రాగులు, జొన్నలు, గోధుమ పిండి వంటి సరుకులు పంపిణీ చేయాల్సిన అవసరం ఉంది.

కందిపప్పు ధర రూ.180

బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ధర ఉంది. ప్రభుత్వం కార్డుదారులందరికీ ప్రతి నెల కందిపప్పు పంపిణీ చేయక పోవడంతో సామాన్యులు ఇంట్లో పప్పు ఉడకడంలేదు. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మార్కెట్‌లో కంది పప్పు ధర పెరిగే సమయంలో గతంలో కార్డుదారులకు రేషన్ సరుకుల్లో, ఇతరులకు రైతుబజార్లలో సబ్సిడీపై సరఫరా చేయడాన్ని పౌరసరఫరాలశాఖ పూర్తిగా విస్మరించింది. కార్డుదారులు కొన్ని నెలలుగా కందిపప్పు అడిగితే ఎండీయూ వాహనదారులు రాలేదని సమాధానం ఇస్తున్నారు. నూనెల ధరలు సలసలా కాగుతున్న నేపథ్యంలో చౌక ధరల్లో పామాయిల్ అందించాల్సిన అవసరం ఉంది. నిత్యావసర ధరలు మండిపోతున్న తరుణంలో రేషన్ ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తే పేదల ఆకలి తీరుతుంది.

రేషన్ సరఫరాపై అధికారుల నియంత్రణ

రోజుకు 150 కార్డులకే సరఫరా

రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వంలోనూ కష్టాలు తప్పడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థతోనే ఇబ్బందులు పడుతున్న కార్డుదారులకు.. రేషన్ సరుకుల సరఫరాలో అధికారుల నియంత్రణ చర్యలు కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి జరగాల్సిన పంపిణీలో అధికారుల నిర్వాకంతో జాప్యం జరుగుతోంది. కొత్త కొత్త నిబంధనలను తెర మీదకు తెచ్చి రేషన్ పంపిణీలో జాప్యం చేస్తున్నారు. ఈ నెల రేషన్ పంపిణీలో పౌర సరఫరాల అధికారులు కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారు. రేషన్ సరఫరా చేసే ఎండీయూ వాహనాలకు నియంత్రణ విధించారు. ఒక్కో ఎండీయూ రోజుకు 150 కార్డులకు మించి రేషన్ సరఫరా చేయకూడదని ఆదేశించారు. ఒక్కో ఎండీయూ వాహనం ఒక రోజులో సగటున 300 కార్డులకు రేషన్ సరఫరా చేస్తుంటుంది. అలాంటిది ఈ నెల నుంచి ఒక్కో ఎండీయూ రోజుకు 150 కార్డులకు మించి రేషన్ సరఫరా చేయకూడదని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ఎండీయూ వాహనదారులు ఒక పూట సరుకులు సరఫరా చేసి రెండోపూట ఆపేస్తున్నారు. దీంతో ఎండీయూ వాహనాల కోసం ఎదురు చూసే రోజు కూలీలు, చిరు ఉద్యోగులు పనులు మానుకుని ఇంకో రోజుపాటు ఎదురు చూడాల్సి వస్తోంది.

వేసవి దృష్ట్యా నిబంధన

వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని రేషన్ సరఫరాను పరిమితం చేశాం. ఉదయం 100 కార్డులు, సాయంత్రం 100 కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఎండీయూ వాహనదారులకు సూచించాం. కార్డుదారులు ఎండలో నించుని ఇబ్బందులు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాం. రోజుకు 200 చొప్పున ఇచ్చినా 17 రోజుల్లో రేషన్ పంపిణీ చేయడం పూర్తవుతుంది. జాప్యమేమీ ఉండదు.

\- కోమలి పద్మ, డీఎస్‌వో

అరకొరగానే సరఫరా..

గత నెలలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అరకొరగానే కందిపప్పు సరఫరా అయింది. ఈ నెలలో కందిపప్పు, జొన్నలను పూర్తిగా నిలిపేశారు. పల్నాడు జిల్లాలో 6,34,893 తెల్ల కార్డులు ఉండగా ఈ నెలలో 3.62 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 4,76,529 తెల్ల కార్డులకు 1.07 శాతం, గుంటూరు జిల్లాలో 5,89531 కార్డులకు 1.43 శాతం కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేశారు.

గుంటూరు.. ఎగుమతుల హబ్



- డీఈహెచ్ స్కీంకి ఎంపిక చేసిన కేంద్రం
- ఇక ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తులు, ఎగుమతుల పెంపు
- మిర్చి, పసుపు, పత్తినూలు రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ
- బాపట్లలో గ్రానైట్, రొయ్యల ప్రాసెసింగ్ ఉత్పత్తులకు ఊతం
- పల్నాడు ప్రాంతం నుంచి టెక్స్‌టైల్స్, సుగంధ ద్రవ్యాల ఎగుమతి

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి, పసుపు, పత్తినూలు ఉత్పత్తిలో ఉమ్మడి గుంటూరు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశ వ్యాప్తంగా పేరుగాంచింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జిల్లా ఎగుమతుల హబ్ (డీఈహెచ్) పథకానికి ఉమ్మడి గుంటూరు జిల్లాను ఎంపిక చేసింది. రాష్ట్రంలో మూడు ఉమ్మడి జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేయగా ఉమ్మడి గుంటూరుకు కూడా ఇందులో చోటుదక్కించుకున్నది. ఈ స్కీమ్‌తో ఆయా రంగాల్లో ఉత్పత్తుల పెరుగుదలతో పాటు పెట్టుబడులను ఆకర్షించే చర్యలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుంది. ఆయా ఉత్పత్తులు, ఎగుమతులను గణనీయంగా పెంచే వాతావరణాన్ని కల్పిస్తారు. టెక్నాలజీ వినియోగానికి ఏకో సిస్టమ్‌ని కూడా అమలు చేసి ఎగుమతిదారుల మధ్య పోటీ తీసుకువస్తారు. దీంతో ఎగుమతి దారులకు వివిధ దశలలో లావాదేవీల ఖర్చు తగ్గనుంది. అలానే ఉపాధి కల్పనకు ఉపయోగపడుతుంది. డీఈహెచ్ స్కీమ్‌ని ఇటీవలే ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కార్యక్రమంతో సమ్మిళితం చేసింది. ప్రధానంగా సప్లై చైన్ సిస్టమ్‌లో ఉన్న ఆటంకాలను గుర్తించి జిల్లా ఎగుమతుల ప్రణాళికలో చర్చించి పరిష్కరిస్తారు. 2030 నాటికి ఎగుమతుల్లో రెండు ట్రిలియన్ల యూఎస్ డాలర్ల లక్ష్యాన్ని అధిగమించేందుకు ఈ డీఈహెచ్ పని చేస్తుంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో హెక్టార్ మిర్చి సాగు చేస్తే 6.25 మెట్రిక్‌టన్నుల దిగుబడి వస్తుంది. అదే బాపట్లలో 6.20, పల్నాడులో 6.25 ఎంటీల దిగుబడి లభిస్తుంది. గతంలో గోనె సంచుల్లో పత్తినూలు, మిర్చి, పసుపు నింపి ఎగుమతి చేసేవారు. అయితే ఇటీవల కాలంలో దిగుమతి చేసుకుంటున్న దేశాల్లోని కంపెనీల సూచనల మేరకు ప్యాకింగ్స్‌లో మార్పులు చేశారు. ప్యాకింగ్, బ్రాండింగ్‌లో ఇంకా మార్పులు జరగాల్సి ఉన్నది. కాగా బాపట్ల జిల్లాలో రొయ్యలను ప్రాసెసింగ్ చేసి తయారు చేసే ఉత్పత్తులు, గ్రానైట్, ప్రత్తి నూలు, ఎసెన్షియల్ ఆయిల్స్, పల్నాడు జిల్లా నుంచి సుగంధద్రవ్యాలు, టెక్స్‌టైల్స్‌ని ఎగుమతులకు గుర్తించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఉమ్మడి గుంటూరు జిల్లా ఒక ఎగుమతుల హబ్‌గా మారుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఈ-కామర్స్, డిజిటిల్ మార్కెటింగ్

అంతర్జాతీయంగా ఇక్కడి ఉత్పత్తులకు ఈ-కామర్స్ డిజిటిల్ మార్కెటింగ్ విధానాల ద్వారా డిమాండ్ ఏర్పడేలా



చేస్తుంది. కిందిస్థాయిలో ఎగుమతుల ప్రోత్సాహం, ఉత్పాదకత, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా చేసుకుని కేంద్ర వాణిజ్య శాఖకు సంబంధించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ సంస్థ డీఈహెచ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే డీజీఎఫ్‌టీ అమేజాన్ ఇండియా, షిప్ రాకెట్, డీహెచ్‌ఎల్ వంటి సంస్థలో ఒప్పందాలు కుదుర్చుకున్నది. స్థానిక ఎగుమతిదారులకు మద్దతివ్వడం, ఈ-కామర్స్ ఎగుమతులను ప్రమోట్ చేయడం, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై వ్యక్తిగత సామర్థ్యం పెంచడం కోసం ఎంఎస్ఎంఈలకు వర్క్‌షాపులను నిర్వహిస్తున్నది.

పర్యాటక ప్రాంతంగా జిల్లా అభివృద్ధి

పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దిశగా కృషి చేయాలని పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలులో పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తక్కువ సమయంలో మెరుగుపర్చేందుకు, జీడీపీ పెంచేందుకు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పర్యాటకరంగంలో పెట్టుబడులు వస్తాయన్నారు. పర్యాటకరంగం ద్వారా ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి పర్యాటకులను ఆకట్టుకోవచ్చని, తద్వారా రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి బీచ్‌ల వద్ద పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. బీచ్‌లలో బీచ్ స్పోర్ట్స్, హౌస్‌బోటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. బీచ్ దగ్గర రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, కాల్వలు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రంగా ఉండాలన్నారు. పర్యాటకులు బీచ్‌కు వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషదాయకంగా ఉండేలా తప్ప నిరాశకు గురికాకుడదన్నారు. ఆదిశగా బీచ్‌ల అభివృద్ధికి తోడ్పడాలని ఆయన అధికారులకు సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా బీచ్ దగ్గర వివిధ రకాలైన భోజన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా జిల్లా వివరాలతో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. చీరాలలో చేనేత చీరలు, జీడిపప్పు, రొయ్యల ప్రాసెసింగ్ గురించి కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (గురువారం)
సహరి : 5.05 (శుక్రవారం)



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌జైన్, కలెక్టర్ వెంకటమురళి తదితరులు

జిల్లాలో ఆరు బీచ్‌లు : కలెక్టర్

జిల్లాలో మొత్తం ఆరు బీచ్‌లు ఉన్నాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. చీరాల ఓడరేవు, పాండురంగాపురం, సూర్యలంక, విజయలక్ష్మీపురం, రామాపురం, పొట్టి సుబ్బయ్య పాలెంబీచ్‌లు ఉన్నాయన్నారు. దేవాలయాలు,బీచ్‌ల వద్ద చేపట్టే పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ముఖ్యకార్యదర్శికి కలెక్టర్ వివరించారు. బాపట్ల, చీరాలో 50 హెక్టార్లలో ఏర్పాటు చేసిన నగర వనం గురించి వివరించారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, ఏఎస్పీ విఠలేశ్వర్, జిల్లా అధికారులు, రిసార్ట్స్ యజమానులు పాల్గొన్నారు.

- ఆరేళ్ల తర్వాత ఆర్థిక కష్టాలకు చెక్
- ఇక నుంచి బిల్లుల చెల్లింపులకు అవకాశం
- పట్టణాల్లో అభివృద్ధి పనులకు సానుకూల పరిస్థితి

మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ

సత్తెనపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నా నిధులు వినియోగించుకునే అవకాశం లేక ఇంతకాలం మున్సిపాలిటీలు ఇబ్బందులు పడుతుండేవి. నిధులు ఉన్నా బిల్లులు చెల్లింపులు చేసుకోలేక.. ప్రభుత్వ అనుమతి కోసం ఎదరుచూపులతో ఉండాల్సి వచ్చేది. మున్సిపాలిటీల్లో పనులు అంటే కాంట్రాక్టర్లు పారిపోయేవారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక ఇలాంటి కష్టాలకు చెక్ పడేలా కూటమి ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ లభించింది. ఇక నుంచి ప్రభుత్వ అనుమతితో సంబంధం లేకుండా నిధులను వినియోగించుకునే అవకాశం మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఆరేళ్ల కష్టాలకు చెక్ పడినట్లుగా మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు భావిస్తున్నారు. 2018కి ముందు మున్సిపాలిటీల నుంచే నేరుగా బిల్లులు చెల్లింపులు జరిగేవి. దీంతో ఎక్కడికక్కడ మున్సిపాలిటీల వారీగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు జరిగేవి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టనప్పటి నుంచి ఈ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. దీంతో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా ఉన్న మున్సిపాలిటీల పరిస్థితి మారింది. ఆర్థిక పుష్టి ఉన్నప్పటికీ నిధులు ఖర్చు చేసుకునే అవకాశం లేక పురపాలక సంఘాలు అల్లాడిపోయేవి. కనీసం వెయ్యి రూపాయలు ఖర్చు చేసినా సంబంధిత బిల్లు వెంటనే చెల్లించే అవకాశం లేకుండా పోయింది. మున్సిపాలిటీలకు సంబంధించి 001, 002 ఆర్థిక సంఘం నిధులు, పద్దులు ఉంటాయి. వీటి ద్వారా వచ్చే నిధులను మున్సిపాలిటీలు ఖర్చు చేసుకుంటాయి. అయితే ఈ పద్దుల అజమాయిషీ ప్రభుత్వం చేతుల్లో ఇప్పటి వరకు ఉంది. అందువల్ల రూపాయి ఖర్చు పెట్టినా సీఎఫ్ఎంఎస్ నుంచే తీసుకునే పరిస్థితి. అది కూడా ఎప్పుడు మంజూరు చేస్తారో అనేది కూడా ప్రశ్నార్థకమే. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా మున్సిపాలిటీల నుంచే నిధులు చెల్లించే అవకాశం కల్పించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మున్సిపల్ పట్టణాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టే అవకాశాలు ఉన్నాయి.



సీఎఫ్ఎంఎస్‌తో కష్టాలే కష్టాలు

2019 చివరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానం అమల్లోకి తీసుకువచ్చింది. మున్సిపాలిటీలకు సంబంధించిన నిధులు కూడా ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లాయి. మున్సిపాలిటీలు బిల్లులు చెల్లించాలంటే సీఎంఎఫ్‌లో నమోదు చేస్తే ఆర్థిక శాఖ ఆమోదం తెలపాలి. ఆ తర్వాతే నిధులు విడుదలయ్యేవి. దీంతో మున్సిపల్ పట్టణాల్లో అత్యవసర, ఇతర ఏ అభివృద్ధి పనులు చేసినా నిధులు మంజూరు కాని పరిస్థితి నెలకొంది. బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్లు అల్లాడిపోయేవారు. సంబంధిత బిల్లుల చెల్లింపులపై సమాధానాలు చెప్పలేక అధికారులు కూడా నలిగిపోయారు. ఈ పరిస్థితుల్లో ఆరేళ్లుగా మున్సిపాలిటీల్లో పనులు అంటే కాంట్రాక్టర్లు పారి పోయే పరిస్థితి నెలకొంది. చాలా మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వచ్చే నెల నుంచి అమలు..

సీఎఫ్ఎంఎస్ విధానానికి చెక్ చెప్తూ కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలు నేరుగా నిధులు వ్యయం చేసుకునే అవకాశం కల్పించింది. ఈ విధానం ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. అయితే నిధుల ఖర్చుకు సంబంధించి గతంలో నిబంధనలే అమలు చేస్తారా?, కొత్తగా ఏమైనా మార్పులు చేస్తారా? అనేది ఇంకా స్పష్టం కాలేదు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు వచ్చే అవకాశంతో పాటు ఏదైనా అత్యవసర పనులను వెంటనే చేపట్టే అవకాశం మున్సిపాలిటీలకు వచ్చింది. కూటమి ప్రభుత్వం నిర్ణయం పట్టణాభివృద్ధికి దోహద పడుతుందని పలువురు కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో దాదాపు ఆరేళ్లు మున్సిపాలిటీలు ఆర్థిక చెల్లింపుల్లో పడుతున్న ఇబ్బందులు తొలిగిపోయినట్లే.

మద్యం షాపులకు నేడు లాటరీ

జిల్లాలో 12 దుకాణాలకు 160 దరఖాస్తులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గీత కార్మిక కులాలకు జిల్లాలో కేటాయించిన 12 మద్యం షాపులకు గురువారం లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కలెక్టరేట్లో కలెక్టర్ వెంకటమురళి సమక్షంలో లాటరీ తీయనున్నారు. దరఖాస్తుల పక్రియ అంతా ఫిబ్రవరి 8 నాటికే ఓ కొలిక్కి వచ్చింది. వెంటనే లాటరీ జరిపి షాపులు కేటాయించాల్సి ఉండగా ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. అయితే ఎన్నికల ఫలితాలు తాజాగా వెల్లడికావడంతో కోడ్‌ను ఎత్తివేస్తున్నట్లు మంగళవారం ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. దీంతో గతంలో నిలిచిపోయిన లాటరీ ప్రక్రియను మళ్లీ ప్రారంభించడానికి ఎక్సైజ్‌శాఖ సమాయత్తమైంది. జిల్లావ్యాప్తంగా 12 మద్యం దుకాణాలకు 160 దరఖాస్తులు వచ్చాయి. వీటి లాటరీ ప్రక్రియ గురువారం కలెక్టర్ సమక్షంలో జరిపి గీత కార్మికులకు మద్యం షాపులను కేటాయించేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుదారులంతా ఉదయం 7 గంటలకే కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. దరఖాస్తుదారులు అప్లికేషన్ కాపీతో పాటు ఎంట్రీ పాస్, తహసీల్దారు జారీ చేసిన కుల, ఉపకుల ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలి. లాటరీలో మద్యం షాపులు పొందిన దరఖాస్తుదారుడు మొదటి విడత నగదును అక్కడికక్కడే చెల్లించాలి.

నేటి నుంచి గుడారాల పండుగ

- దయాక్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన విశ్వాసులు
- లేమల్లె ప్రాంగణంలో హోసన్న మందిరం ప్రారంభం

8





హోసన్న మందిరం ప్రారంభిస్తున్న పాస్టర్ మోహన్ సీ లాజరస్, జాషువా మోజెస్, అబ్రహాం, జాన్‌వెస్లీ ఇతర దైవజనులు , హాజరైన భక్తులు

పందికొక్కుల దాడిలో శిశువు మృతి



మృతి చెందిన బాలుడు

నూజెండ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పందికొక్కుల దాడిలో మూడు నెలల పసికందు మృతి చెందిన సంఘటన మండలంలోని రవ్వవరం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయని కొండ గురవయ్య, దుర్గమ్మ ఊరు బయట గుడారంలో నివశిస్తూ గాజులు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి అప్పటికే మూడు సంవత్సరాల పాప ఉండగా, మూడు నెలల క్రితం మూడు రోజుల దివ్యాంగుడైన పసి బాలుడిని తీసుకొని వచ్చి పెంచుకుంటూ కౌషిక్‌గా పేరు పెట్టారు. బుధవారం ఉదయం తమ కుమార్తె దుకాణం వద్దకు వెళ్లేందుకు ఏడుస్తుండటంతో బాలుడిని ఇంట్లో పండుకొన బెట్టి కుమార్తెను తీసుకొని దుర్గమ్మ దుకాణానికి వెళ్లింది. తిరిగి వచ్చేలోగా ఇంటిలో నేలపై పండుకున్న కౌషిక్‌ను పందికొక్కులు తీవ్రంగా గాయపర్చాయి. బాలుడు ఏడుస్తుండటంతో తీవ్ర గాయాలైన కౌషిక్‌ను తీసుకొని దుర్గమ్మ గ్రామంలోని వైద్యునికి చూపించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ విన్యాసమ్మ, అంగన్, వైద్య సిబ్బంది పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కౌషిక్ వివరాలు అంగన్ వాడీ కేంద్రాల్లో నమోదై ఉండక పోవటం, ఆషా కార్యకర్త వద్ద మాత్రమే నమోదై ఉన్నాయని వారు తెలిపారు. సరైన నివాస వసతి లేక పోవటం వల్ల బాలుడు పది కొక్కులకు బలయ్యాడని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తమకు మగ బిడ్డ లేడని తీసుకువచ్చి పెంచుకోవటం కూడా గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఐనవోలు ఎస్ఐ బి.వి.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వకాల్లో పురాతన విగ్రహాలు లభ్యం



తవ్వకాలలో బయటపడ్డ సుమారు 700 ఏళ్ల నాటి విగ్రహాలు

ముప్పాళ్ళ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ముప్పాళ్ళలో ముస్లిం ఏరియాలో శివాలయానికి, మసీదుకు సమీపంలో అతి పురాతన కాలం నాటి పడగవిప్పిన నాగేంద్ర స్వామి విగ్రహం, గొల్లబామ విగ్రహం తవ్వకాలలో బయటపడ్డాయి. గ్రామానికి చెందిన వారు జేసీబీతో తవ్వడంతో సుమారు 10 అడుగుల లోతులలో బయట పడ్డాయని గ్రామస్తులు బుధవారం తెలిపారు. గతంలో అదే ప్రాంతంలో వినాయకుని విగ్రహం బయట పడటంతో విగ్రహాన్ని వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ప్రతిష్ఠించారు. ప్రస్తుతం లభించిన చోళ కాలం విగ్రహాలుగా గుర్తించామని, శాస్త్రోక్తంగా పూజలు చేసి విగ్రహాలను గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో పునఃప్రతిష్ఠింపజేస్తామని గ్రామ ప్రధాన అర్చకులు నారాయణం శ్రీనివాసమూర్తి తెలిపారు. పురాతన విగ్రహాలను పురావస్తు శాఖ అధికారుల పరిశీలన అనంతరం దేవదాయశాఖ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా విగ్రహాలను ఆలయానికి తరలించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.భవాని శంకర్ తెలిపారు.

అందరికీ ఆమోదయోగ్యమైన కేంద్ర బడ్జెట్

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ



పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు ఎంతో ఆమోదయోగ్యమైనదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ పేర్కొన్నారు. బుధవారం బాపట్ల విచ్చేసిన ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలో, బాపట్ల జిల్లాకు కేంద్రం అందించిన సహకారం గురించి వివరించారు. వందల కోట్ల రూపాయలతో కొరిశపాడు దగ్గర 4.1 కిలోమీటర్ల ఎమర్జన్సీ ల్యాండింగ్ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో సుకోయ్‌లాంటి యుద్ధ విమానాలు సైతం అక్కడ దిగవచ్చు అన్నారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులు కూడా పంచాయతీలకు, మున్సిపాలిటిలకు అందాయన్నారు. రూ. 1064.24 కోట్లతో నూతనంగా 167ఎ జాతీయ రహదారి నిర్మాణంతో రవాణా వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ హైవేతో చీరాల నుంచి సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహంతోపాటుగా బాపట్ల-ఓడరేవు మధ్య బీచ్‌టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాపట్ల-చుండూరు మధ్య 32 కిలో మీటర్లు రైలుమార్గం, బాపట్ల-నూరారెడ్డిపాలెం మధ్య 74 కిలో మీటర్ల రైలుమార్గం వేయటమే కాక బాపట్ల, చీరాల, రేపల్లె రైల్వేస్టేషన్‌లను అమృత్ స్టేషన్‌ల జాబితాలో చేర్చి కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇవేకాకుండా జిల్లాలో నిజాంపట్నం ఆక్వాపార్క్ రూ. 300 కోట్లతో, ఫిషింగ్ హార్బర్ రూ. 438 కోట్లతో నిర్మించిందని ఆమె పేర్కొన్నారు. సాగరమాల ద్వారా ఈ సంవత్సరం రూ. 2243 కోట్లను రాష్ట్రానికి ఇచ్చినట్లు తెలిపారు. పీఎం మత్స్య సంపద కింద ఈ సంవత్సరం రాష్ట్రానికి రూ. 15 వేల కోట్లు కేటాయించారని ఆమె వివరించారు. ఇంకా మరెన్నో ప్రాజెక్ట్‌లకు కేంద్రం నిధులివ్వగా జిల్లాలో వాటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బడ్జెట్ గురించి దేశవ్యాప్తంగా జరుగుతున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా తాను వచ్చినట్లు తెలిపారు. వేతనజీవులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆదాయ పన్ను మినహాయింపు రూ. 12లక్షల వరకు ఇవ్వటం ఎంతో మంది మధ్యతరగతి వేతనజీవులకు ఊరటనిస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలవరం నిర్మాణం కోసం నిధులు, ప్రధానమంత్రి ఆవాసయోజన పథకం కింద రాష్ట్రానికి ఇళ్ల కేటాయింపులో అగ్రస్థానం ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిపై నిబద్ధతకు నిదర్శనమన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, రూరల్ అధ్యక్షుడు పేరి రెడ్డి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మిమిడి రమేష్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కరీముల్లా, బాబునాగేంద్ర పాల్గొన్నారు.

ప్రార్థన ద్వారా పరలోకం సిద్ధిస్తుంది

● గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య



మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మానవాళికి ప్రార్థన, ఉపవాసం, దాన ధర్మాలు చేయటం ద్వారానే మోక్ష ప్రాప్తి జరుగుతుందని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు ఫిరంగిపురంలోని బాల ఏసు కథెడ్రల్ దేవాలయంలో విభూది బుధవారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులకు ప్రతి ఏడాది క్రీస్తు శ్రమల కాలం ప్రత్యేక దినాలుగా ఉంటాయన్నారు. ఈ 40 దినాలు ఉపవాస దీక్షలు చేస్తూ నిష్టతో నియమాలను పాటిస్తూ జీవించాలన్నారు. దీని ద్వారా ఈస్టర్ పండగకు సంసిద్ధులు కావాలన్నారు. క్రీస్తు శ్రమల కాలంలో క్రైస్తవులు మూడు ఆయుధాలు కలిగి ఉండాలన్నారు. ప్రార్థన, ఉపవాసం, దాన ధర్మాలు చేస్తూ జీవించాలన్నారు. క్రీస్తు శ్రమలను అత్యంత ప్రవిత్రంగా ధ్యానించాలని ఆయన తెలిపారు ఈ సందర్భంగా 450 మంది క్రైస్తవులు జపమాలను ధరించి ప్రత్యేక దీక్షలు చేపట్టారు. పూజాబలిలో దివ్య సత్ప్రసాదాన్ని బిషప్ భాగ్యయ్య భక్తులకు పంపిణీ చేశారు. పూజలో బాల ఏసు చర్చి ఫాదర్ ఎం పాతిమా మర్రెడ్డి, ఫాదర్ ప్రవీణ్, ఫాదర్ రవీంద్ర, ఫాదర్ మద్దు బాలస్వామి, ఫాదర్ విలియమ్, గుడి పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతగా తెనాలి జేఎంజే



విజేతగా నిలిచిన జేఎంజే జట్టును అభినందిస్తున్న ఎంపిక కమిటీ సభ్యులు, ముఖ్యఅతిథులు

నరసరావుపేట టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజేతగా తెనాలి జేఎంజే కళాశాల నిలచిందని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు బుధవారం తెలిపారు. ద్వితీయ స్థానంలో ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్స్ కళాశాల, మూడో స్థానంలో ఎంఏఎం ఫార్మసీ కళాశాల నిలిచాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన చిలకలూరిపేట శ్రీనిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ శిరీష, ఏఎన్‌యూ యోగా సెంటర్ కోఆర్డినేటర్ డి. సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఆటలో గెలుపు, ఓటములు సహజమన్నారు. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, టోర్నమెంట్ చైర్మన్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, పీడీ జె.శంకర్, కమిటీ సభ్యులు సీహెచ్ వెంకటరావు, జె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా ఎంఏఎం ఫార్మసీ విద్యార్థులు యు.అఖిల, షేక్ ఆఫ్రీన్ ఆల్ ఇండియా మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయ్యారని డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. మార్చి 29న కరైకుడిలోని అల్గాప్ప విశ్వవిద్యాలయంలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

పెన్షన్ కోసం వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు నిరసన



వీసీ చాంబర్‌లో కింద కూర్చొని నిరసన తెలియజేస్తున్న వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు

పెదకాకాని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకి సంబంధించిన పెన్షన్లు విశ్రాంత అధ్యాపకులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు బుధవారం నిరసనకు దిగారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీసీ చాంబర్‌లో కింద కూర్చొని నిరసన తెలియజేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య విష్ణువర్ధన్, కార్యదర్శి శివప్రసాద్, విశ్రాంత ఉద్యోగి మల్లేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు బుధవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావును ఆయన చాంబర్లో కలిశారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలకు సంబంధించిన జీతాలను యూనివర్సిటీ రెగ్యులర్ ఉద్యోగులకు యూనివర్సిటీ నిధుల నుంచే చెల్లించారని, అధ్యాపక సిబ్బందికి, విశ్రాంత అధ్యాపకేతర ఉద్యోగులకు కూడా ఫిబ్రవరి నెలకు సంబంధించిన పెన్షన్లు యూనివర్సిటీ నిధుల నుంచే చెల్లించారని, కానీ యూనివర్సిటీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన రెగ్యులర్ అధ్యాపకులకు మాత్రం నిధులు లేవన్న సాకుతో పెన్షన్ నిలిపియడం సరికాదని వారు వీసీ దృష్టికి తీసుకువచ్చారు. డీఏ బకాయి కూడా వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు తాము నిరసన విరమించమని వీసీ చాంబర్లో నేలపై కూర్చున్నారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం పెన్షనర్లతో చర్చలు జరిపారు. సోమవారం నాటికి పెన్షన్లు చెల్లిస్తామని తెలిపారు. డీఏ బకాయి కూడా చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

అప్పు చెల్లించలేదని ఆత్మహత్యకు ప్రేరేపణ

● గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతి

పిడుగురాళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించలేదని ఆ వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటన రెండు రోజుల క్రితం పిడుగురాళ్లలో జరిగింది. పిడుగురాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లికి చెందిన ముప్పాళ్ల అంజిబాబు అదే పట్టణానికి చెందిన షేక్ మాబుసుభాని వద్ద రెండున్నర లక్షలు అప్పు తీసుకున్నాడు. వ్యక్తిగతంగా కొన్ని అప్పులు చేసి వాటిని తీర్చలేని పరిస్థితిలో ఉన్నానని పరిచయస్తుడైన పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ మాస్టర్ రామారావు వద్ద పలుమార్లు వాపోయాడు. కొంతకాలంగా అప్పుల బాధ తప్పుకునేందుకు పిడుగురాళ్లకు వచ్చి స్టేషన్ మాస్టర్ అయిన రామారావు రైల్వే క్వార్టర్స్‌లో తలదాచుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న అంజిబాబు పిడుగురాళ్లలో రైల్వేక్వార్టర్స్‌లో రామారావు వద్ద ఉన్నట్లు తెలుసుకున్న మాబుసుభాని మరికొంతమంది స్నేహితులతో కలిసి అంజిబాబు ఉంటున్న రైల్వే క్వార్టర్స్ వద్దకు వచ్చి మాట్లాడుకుందాం రమ్మని అంజిబాబుతో పాటు గవన్ కుమార్‌రెడ్డిని తీసుకొని కారులో హైవేపై ఉన్న ఖలీల్ దాబా ఎదురుగా ఉన్న ప్లాట్ల వద్దకు వెళ్లారు. అక్కడ అప్పు చెల్లించాలని అంజిబాబుతో మాబుసుభాని గొడవపడి ఇద్దరూ చేతులతో కొట్టుకున్నారు. బాకీ చెల్లించేందుకు అంజిబాబు కొందరిని ఫోన్‌లో డబ్బులు అడుగగా డబ్బులు లేవని తెలుపడంతో మనస్తాపానికి గురై ఖలీల్ దాబా వద్ద ఉన్న ప్లాట్ల నుంచి పిల్లుట్ల శివారులోని నాగేశ్వరపురంతండాలోని వ్యవసాయ పొలాల్లోకి వెళ్లారు. అక్కడ సాయంత్రం 7 గంటల వరకు బాకీ చెల్లించాలనే విషయంలో వాగ్వివాదం జరిగి బాకీ చెల్లించలేకపోతే చావమని రెచ్చగొట్టారు. గడ్డిముందు తెచ్చిస్తే తాగి చనిపోతానని అంజిబాబు తెలుపగా మాబుసుభాని తనతోపాటు వచ్చిన వ్యక్తులతో గడ్డిమందు డబ్బా కొనితెచ్చిచ్చారు. అంజిబాబు గడ్డిమందును మద్యంలో కలిపి తాగగా మాబుసుభానితోపాటు వచ్చిన మరికొందరు పారిపోగా అంజిబాబు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు వచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స పొందుతూ గుంటూరులోని రమేష్ హాస్పటల్‌లో మృతి చెందినట్లు సీఐ ఎస్ వెంకట్రావు తెలిపారు. గవన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడి అరెస్టు

● 120 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఆరు నెలల్లో తాడేపల్లిలో జరిగిన వరుస చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు వివరాలు వెల్లడించారు. సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ ఖాజావలి సిబ్బందితో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో విశ్వసనీయ వర్గాల వారి సహకారంతో పక్కా సమాచారం సేకరించి నిందితుడిని గుర్తించారు. ఈ క్రమంలో తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి వద్ద కాపుకాసి స్కూటీపై వెళుతున్న శీలం కమల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరికి చెందిన కమల్ పగటి వేళల్లో ఒంటరిగా వెళుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని మెడలో ఉన్న బంగారు చైన్లు దొంగతనం చేసి పారిపోతున్నట్టు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. తాడేపల్లిలో నమోదైన మూడు కేసులకు సంబంధించి సుమారు రూ.10లక్షల విలువైన 120 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీఐ కల్యాణ్‌రాజు, ఎస్ఐ ఖాజావలి, సిబ్బంది సురేశ్, ప్రసాద్, పరమేష్‌లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

ఆలపాటికి నాని, పంచుమర్తి అభినందనలు





గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు- కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం పొందిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి టీడీపీ గుంటూరు జిల్లా సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు, కోవెలమూడి రవీంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు కసుకుర్తి హనుమంతరావు, పానకాల వెంకట మహాలక్ష్మి, ఉప్పుటూరి పేరయ్య, వినోద్, వెంకటేశ్వరరావు, నలబోతు శ్రీనివాసరావు, అడపా శివప్రసాద్ బాబు, పాములపాటి శ్రీనివాసరావు, పుల్లా సుందరం బాబు తదితరులు ఉన్నారు.

జగన్‌కు విమర్శించే అర్హత లేదు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవడంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. కార్పొరేటర్‌కు ఎక్కువ, ఎమ్మెల్యేకి తక్కువ అంటూ మాట్లాడటం తగదన్నారు. ఇలాంటి అహంకార మాటలకే 11 స్థానాలకు దిగజారారని అన్నారు. సొంత చెల్లి, తల్లి, కార్యకర్తలే అతన్ని నమ్మడం లేదన్నారు. ఎమ్మెల్సీ బ్యాలెట్ ఎన్నికలలో కూడా 67 శాతం ఓట్లు కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాదు, రాజశేఖర్‌కు ప్రజలు వేశారన్నారు. ఈవీఎం, బ్యాలెట్ పద్ధతులలో ఏ ఎన్నికలైనా గెలుపు మాత్రం కూటమి పార్టీలదే అన్నారు. గత ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి కంటే పవన్‌కల్యాణ్‌కు వచ్చిన మెజార్టీ, వైసీపీ, జనసేనకు వచ్చిన సీట్లు ఎన్నో జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించుకోవాలన్నారు. మంచి ప్రవర్తనతో వ్యవహరిస్తే బాగుంటుందన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సమయం చూసి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాడికొండలోని జనరల్, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ విద్యార్థినుల కోసం, జనరల్ బాలుర కోసం రెండు గురుకులాలు ఉన్నాయని తెలిపారు. ఆయా గురుకులాల్లో 5వ తరగతితోపాటు 6,7,8 తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఈ నెల 31లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 8712625038లో లేదా https://aprs.ap.cfss.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల, మార్చి 5 (ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెంలో గల పీఎం ఏపీ మోడల్ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశించే విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు పి. హవీలా, డి.బ్రహ్మేశ్వరరావు బుధవారం తెలిపారు. పరీక్ష కోసం కనీస వయస్సు ఓసీ, బీసీ విద్యార్థులకు పది నుంచి 12 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 14 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. 2024-25 సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 5వ తరగతి చదివి ప్రమోషన్ పొందిన వారై ఉండాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు కనీస ఉత్తీర్ణత ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులని తెలిపారు. పరీక్షల్లో కనబరిచిన ప్రతిభా మార్కులు, రిజర్వేషన్ నియమాలను అనుసరించి ఎంపిక చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

తెనాలి క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పట్టణంలోని ఇస్లాంపేట పాలపర్తి వారి వీధిలో జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలి మున్సిపాలిటీలో దినసరి కూలీగా పని చేస్తున్న యర్రంశెట్టి సాయికల్యాణ్ (27)కు నాలుగు సంవత్సరాల క్రితం బాపట్లకు చెందిన దుర్గాభవానీతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ పిల్లలు. ఇరు కుటుంబాలలో ఏర్పడిన చిన్నపాటి గొడవలు కారణంగా భార్య సంవత్సర క్రితం పుట్టింటికి వెళ్లింది. గత నెలలో తిరిగి కాపురానికి తెనాలి వచ్చింది. ఆ సమయంలో కూడా భర్త సరిగ్గా ప్రవర్తించకపోవడంతో తిరిగి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాపట్లలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కొద్దిరోజుల క్రితం బాపట్ల పోలీసులు సాయికళ్యాణ్‌కి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. బుధవారం ఉదయం ఇంటిలో సాయికల్యాణ్ ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుని మరణించి ఉండటం తల్లిదండ్రులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు చేసుకుని విచారిస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

కారంపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని నరమాలపాడు శివారులో బుధవారం జరిగింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామానికి చెందిన తాడి సత్తిబాబు (40) వినుకొండ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు సుబాబులు చెట్లు నరికేందుకు ట్రాక్టర్‌లో వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని నరమాలపాడు శివారులో ట్రాక్టర్ అదుపుతప్పడంతో సత్తిబాబు ట్రాక్టర్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ టైరు అతనిపైకి ఎక్కడంతో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వాసు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 526.50 అడుగులు ఉంది. ఇది 161.39 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8718 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,821 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

1,30,346 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,18,446 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,30,346 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,217 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	13000
334	9500	13700	బ్యాడిగి 355	10500	13500
నంబరు. 5	10500	13500	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10500	12500
341	10500	14600	ఎన్ఎస్ 250		
4884	10000	10700	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	12500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11500
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు రాయితీ

● ఎస్ఈ జి.ఆంజనేయులు

కర్లపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులకు విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందని ఎస్ఈ జి.ఆంజనేయులు తెలిపారు. ఈనెల ఒక టి నుంచి జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో గాని లేదా విద్యుత్ ఉపకేంద్రంలోని అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఒక కిలో వాట్‌కు గవర్నమెంట్ ఛార్జీలు రూ.2 వేలు చెల్లించాలని, కాని ఈ స్కీమ్ కింద రూ.వెయ్యి కడితే సరిపోతుందన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎలాంటి మార్పు ఉండదని, కిలో వాట్‌కు రూ.200 చెల్లించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లా గృహ విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకోవాలని ఎస్ఈ కోరారు. ఆయన వెంట డీఈ టి.శ్రీనివాసరావు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలి : ఎంపీడీవో

వేమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గ్రామాల్లో పి సర్వేను నిర్వహించాలని ఎంపీడీవో శివన్నారాయణ అన్నారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో సర్వే నిర్వహణపై పంచాయితీల కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులకు బుధవారం ప్రత్యేక అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పేదలలో అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందిని గుర్తించి వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం సర్వేను చేపట్టడం జరిగిందన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి సర్వేను ప్రారంభించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్ హరికృష్ణ, సర్వే నిర్వహణాధికారి విధి విధానాలను వివరించారు. ఈవోపీఆర్డీ శేఖర్ హాజరయ్యారు.

కుట్టుమిషన్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్హులైన పేదమహిళలు కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.శోభారాణి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు కుట్టుశిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ బీసీలకు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, 90 రోజుల శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు అందజేస్తారని తెలిపారు. ఈనెల 7వ తేదీ లోపు అర్హులైన మహిళలు పేర్లను సమీప సచివాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించి కుట్టుమిషన్‌లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు తెలిపారు. ఆసక్తి, అర్హత గల మహిళల పేర్లను గ్రామ సచివాలయాలలో నమోదు చేయాలని కార్యదర్శులకు ఆయన సూచించారు. మహిళలకు 90 రోజుల కుట్టుశిక్షణ నిర్వహించి, కుట్టు మిషన్‌లు అందజేయాలని ఆయన తెలిపారు.

12న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

చెరుకుపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గూడవల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ఈనెల 12వ తేదీన శాంతి కల్యాణ మహోత్సవం జరపబడుతుందని, భక్తులు అందరూ విచ్చేసి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని ఆలయం ఈవో జంజనం సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువు నమోదు

చుండూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని మోదుకూరు సెక్టార్ మండూరు గ్రామంలో ఈసీసీఈ దిన ప్రాముఖ్యతను సూపర్‌వైజర్ నగరాజకుమారి, తల్లులకు వివరించారు. పిల్లల ఎత్తు, బరువులు తీసి వయసును బట్టి ఎంత బరువు ఉన్నది తెలియజేశారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేసిన పెరటి తోటల్లో పెంచిన ఆకు కూరలు, గర్భిణులు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాలలో నేటి నుంచి ముసాయిదా జాబితా : ఏవో

కర్లపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీ పంట నమోదుకు సంబంధించిన ముసాయిదా జాబితా సామాజిక తనిఖీ కొరకు రైతు సేవా కేంద్రాలలో గురువారం నుంచి అందుబాటులోకి వస్తుందని మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ అన్నారు. మండలంలోని యాజలి, దుండీవారిపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు ముసాయిదా జాబితాను పరిశీలించుకొని సవరణలు ఏమైనా ఉంటే ఈనెల 17వ తేదీలోపు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా రైతు గుర్తింపు సంఖ్య పొందాలని, సొంత భూమి కలిగిన రైతులు ఈనెలాఖరు లోపు రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి వివరాలు తెలపాలన్నారు.

అర్హత కలిగిన చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం వ్యవసాయ పరికరాలను ఈనెలలో అందిస్తుందని, దీని కొరకు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు నమోదు చేసుకోవాలని ఏవో సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత, భాగ్యలక్ష్మి, గోపి, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా వాణిజ్య వ్యాపార లావాదేవీలు నిర్వహించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా వాణిజ్య వాపార లావాదేవీలు నిర్వహించటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ జిల్లా డిస్ట్రిక్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీల ద్వారా వాణిజ్య కార్యకలాపాలు చేపట్టటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయటానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. డిస్ట్రిక్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీల ద్వారా మల్టీపర్పస్ గోదాములు నిర్మించటానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్రోల్ బంకులు, ఫర్టిలైజర్ షాపులు, జనరిక్ మందుల షాపులు నిర్వహించటానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ధాన్యం సేకరణ కేంద్రాలు, వేబ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రికార్డుల కంప్యూటరీకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి సీహెచ్ శ్యాంసన్, వ్యవసాయ శాఖ జేడీ కె.రామకృష్ణ, పశుసంవర్ధకశాఖ జేడీ వేణుగోపాల్, గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సీఈవో ఫణికుమార్, ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో బిందు పాల్గొన్నారు. సహకార బ్యానర్‌ను ఆవిష్కరించారు.

ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ సమర్థవంతగా నిర్వహించాలి

ఆధార్‌కార్డుల నవీకరణ ప్రక్రియ జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డుల నమోదు, నవీనకరణ ప్రక్రియపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డుల నవీకరణ పెండింగ్ ప్రక్రియపై అధికారులు దృష్టిసారించాలని చెప్పారు. ఆధార్‌కార్డుల నమోదులో బాపట్లజిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. బాపట్లకు 23 ఆధార్ కేంద్రాలు నూతనంగా మంజూరయ్యాయన్నారు. ఐదేళ్ళు దాటిన చిన్నారులు, 15 సంవత్సరాలు దాటిన యువత తప్పనిసరిగా ఆధార్‌కార్డులు నవీనకరణ చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 58,260 మంది ఐదేళ్ళలోపు చిన్నారులు ఆధార్ నవీకరణ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. 15ఏళ్ళు దాటిన యువతీ,యువకులు జిల్లాలో 91,525 మంది ఉన్నారన్నారు. వీరందరికి ఆయా కళాశాలలోనే ఆధార్ నవీనకరణకు ప్రత్యేకశిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. తప్పనిసరిగా ఆధార్ నవీకరణ చేయించుకోవాల్సిన వారు జిల్లాలో 1,49,785 మంది ఉన్నారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్టీలకు ఆధార్ కార్డు నమోదు కాగా కార్డులు రాకపోవటంపై ఆరా తీశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ కె.దామోదర్, విజయలక్ష్మి, ఆధార్ జిల్లా కో ఆర్డినేటర్ యశ్వంత్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● కలెక్టర్‌ను ఆదేశించిన మంత్రి సంధ్యారాణి

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలెక్టర్‌లను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి మహిళా దినోత్సవం నిర్వహించటానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌లతో బుధవారం ఆమె వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వశాఖల సహకారంతో మహిళలకు సంక్షేమ పథకాలు అందజేయాలని చెప్పారు. స్థానిక శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఒక కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణానంతరం మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేసి పత్రాలు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ జె.వెంకటమురళి, డీఆర్‌డీఏ పీడీ పద్మజ, సర్వశిక్షాభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మహిళా దినోత్సవ ఏర్పాట్లపై అనుబంధ శాఖల జిల్లా అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు ముందస్తుగా క్రీడా పోటీలను నిర్వహించాలని చెప్పారు. విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మహిళా దినోత్సవానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. వివిధ రంగాలలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న మహిళలను గుర్తించి సత్కరించాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న మహిళలను గుర్తించి అలాంటి వారిని ప్రోత్సహిస్తూ బహుమతులివ్వాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ పద్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, మోడల్ అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

బాపట్ల రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలోని 4 సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై గెస్ట్ లెక్చర్ ఏర్పాటు చేయటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి అన్నారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ మెంటర్, లీడర్‌షిప్ కోచ్ పి.శ్రీనివాసరావు పెయిన్ పాయింట్స్ అండ్ ఛాలెంజ్స్ ఆఫ్ స్టూడెంట్స్ టు గేట్ద జాబ్ అండ్ సర్వీస్ ఇన్ ఎంఎన్‌సి కంపెనీస్ అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ చదువు ముగించుకునే దశలోపే తమ కెరీర్‌కు సంబంధించి నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించుకునేందుకు తగు మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. బహుళజాతి ఫార్మా కంపెనీలో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

రెడ్‌క్రాస్ సొసైటీలో 24 మంది ప్యాట్రన్ సభ్యులను చేర్చిన ఆర్డీవో



నారాయణభట్టుకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో పి.గ్లోరియా

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా 24 మంది ప్యాట్రన్ సభ్యులను చేర్పించారు. తద్వారా జిల్లా స్థాయిలో ప్రథమంగా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ జె.వెంకటమురళి చేతులమీదగా రూ.6,02,400లను రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టుకు అందజేశారు. ఆర్డీవోను కలెక్టర్ అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి టి.ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

అబ్కాస్ సిస్టమ్‌ను కొనసాగించాలి



డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్‌నాయకులు

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అబ్కాస్ సిస్టమ్‌ను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిదాసు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కలెక్టరేట్ వద్ద మున్సిపల్ వర్కర్స్‌తో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 వేల మంది అబ్కాస్ కార్మికులుగా పని చేస్తున్నారని, నేడు ప్రభుత్వం అబ్కాస్‌ను తొలిగించాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అబ్కాస్ ఉండటం వల్ల కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం దీనిపై పరిశీలన చేసి పేద ప్రజల ఉద్యోగ రక్షణను దృష్టిలో పెట్టుకొని అబ్కాస్ పేరు మార్చి ఇంకొక పేరుతోనైనా ఇదే సిస్టమ్‌ను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.సుబ్బారావు, కార్యదర్శి డొక్కా మాల్యాద్రి, చీరాల అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, సెక్రటరి పి.కామాక్షి, ఏఐటీయూసీ నాయకులు బి.శామ్యూల్, సత్యవతి, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, కుమారి, దుర్గా, విజయలక్ష్మి, బాబురావు, సురేష్ పాల్గొన్నారు. అనంతరం డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

స్నేహపూర్వక గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ శ్రీదేవి

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మహిళ, బాలికల స్నేహపూర్వక పంచాయతీల ఏర్పాటుపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు అధ్యక్షతన రెండురోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ జాయింట్ డైరెక్టర్ జీవీ శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 26 జిల్లాలకు చెందిన 26 గ్రామపంచాయతీల మహిళా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు భాగస్వాములుగా శిక్షణలో పాల్గొన్నారు. మహిళ, బాలికల స్నేహపూర్వక పంచాయతీలు అంటేమిటి, ఆదర్శవంతమైన మహిళ, బాలికల స్నేహపూర్వక గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దటంలో పంచాయతీ పాత్ర గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆర్.కేశవరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ జి.రమణ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్



డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు

పిట్టలవానిపాలెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామ పంచాయతీలో కలెక్టర్ శాశ్వత డంపింగ్ యార్డు నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియాకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు రెవెన్యూ సిబ్బందితో కలిసి చందోలు పంచాయతీలోని విద్యుత్‌సబ్ కూడలిలో గల నడిగడ్డ ప్రాంతంలో గల స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ఆదిరామచంద్రరావు, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, వీఆర్వో లక్ష్మీప్రసన్న, గ్రామపంచాయతీ కార్యదర్శి బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

తెలుగు లిపి పుట్టింది భట్టిప్రోలులోనే

● విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి



తెలుగు లిపి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు లిపి భట్టిప్రోలులోనే పురుడు పోసుకుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి అన్నారు. స్థానిక బౌద్ధ స్థూపంను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు లిపే తెలుగు లిపికి మాతృక అని, భట్టిప్రోలు శాసనం తెలుగు లిపికి సంబంధించిన అతి ముఖ్యమైన ఆధారమన్నారు. కాల క్రమంలో ఆ లిపి ఆది ఆంధ్ర లిపిగా పరిణామం చెందిందన్నారు. అనేక దశల తరువాత భట్టిప్రోలు లిపి కీ.శ.5వ శతాబ్దం నాటికి తెలుగు లిపిగా రూపాంతరం చెందిందన్నారు. దక్షిణ భారతదేశపు లిపులు అన్ని భట్టిప్రోలు లిపి నుండే ఉద్భవించాయని చెప్పారు. భట్టిప్రోలు లిపికి సంబంధించి కరపత్రాన్ని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ వీసీ సాయిబాబు, డాక్టర్ బహుగుణ పార్థసారధి, జీవీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన సదస్సు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, విద్యార్థులకు విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి అవగాహన సదస్సు నిర్వహించారు. భట్టిప్రోలు విశ్వశాంతి విద్యా సంస్థలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ పత్రిక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. పాఠ్యాంశాల విజ్ఞానంతో పాటు సామాజిక విజ్ఞానం కూడా మేధస్సు పెంపొందడానికి దోహదపడుతుందన్నారు. పదో తరగతి పూర్తయిన తరువాత ఏ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి. ఏ రంగాన్ని ఎంచుకోవాలి అని నిర్దిష్ట ప్రణాళికలను ఎలా రూపొందించుకోవాలో విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విశ్వశాంతి విద్యా సంస్థ యాజమాన్యం ఆయనను దుశ్శాలువా, మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో బహుగుణసారధి, డాక్టర్ వీసీ సాయిబాబు, జి.వెంకటేశ్వర్లు, హెచ్ఎం ఫణిపార్థసారధి, విద్యాసంస్థ కరస్పాండెంట్ వెంకట్రావు, బి.శ్రీధర్ పాల్గొన్నారు.

పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

● జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మార్కండేయబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మార్కండేయబాబు

వేమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయాలని అందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, బాపట్ల పార్లమెంటరీ స్థాయి ప్లీనరీ అధ్యక్షుడు మార్కండేయబాబు పిలుపునిచ్చారు. మండలంలోని చావలి వాలేశ్వరస్వామి మండప ప్రాంగణంలో బుధవారం నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఉసా రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవ పరమావధిగా పని చేస్తున్న పవన్ ఆశయాలకు అనుగుణంగా పార్టీశ్రేణులు పని చేయాలన్నారు. ఈ సమావేశంలో చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కలవ వెంకటసుబ్బయ్య గుప్తా, రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి మత్తి భాస్కరరావు, చుండూరు మండల అధ్యక్షుడు శ్రీరామమూర్తి, కొల్లూరు అధ్యక్షుడు చలమయ్య, అమృతలూరు అధ్యక్షుడు రమేష్, గుంటూరు కార్పొరేటర్ శివకుమార్, పోకల శ్రీనివాసరావు, ధర్మేంద్ర, దాసరి శ్రీనివాసరావు, చింత రాజు తదితరులు ప్రసంగించారు. ఐదు మండలాల నుంచి వివిధ స్థాయిలకు చెందిన పార్టీ నాయకులు హాజరయ్యారు.

గ్రామాల్లో వర్క్‌ఫ్రం హోమ్ సర్వే

వేమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధి గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ సర్వే నిర్వహిస్తున్నారు. ఈనెల 10వ తేదీ వరకు జరిగే సర్వేలో 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిలో ఐటి సెక్టార్‌లో పని చేసేందుకు ఆసక్తి కలిగిన యువతీ, యువకులను గుర్తిస్తున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ద్వారా శిక్షణ ఇవ్వడంతో పాటు ఇంటి వద్ద నుండే ఉద్యోగ బాధ్యతలను నిర్వహించే విధంగా ప్రభుత్వం సహకరిస్తుందని ఉద్యోగులు అంటున్నారు. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో పని చేసే వారికి కూడా వాళ్ల అంగీకారాన్ని తెలియజేస్తే అలాంటి వారికి ప్రత్యేక శిక్షణతో పాటు స్థానికంగా ఉద్యోగ విధులు నిర్వహించే విధంగా ప్రభుత్వం సహకరిస్తుందని అంటున్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న ఆటో : డ్రైవర్‌కు గాయాలు

కొల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న వాహనాన్ని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మొసలిపాడు గ్రామానికి చెందిన శ్రీరాములు క్రాంతికుమార్ తన ఆటోలో కొల్లూరులో ఓ వృద్ధురాలిని ఎక్కించుకుని తెనాలి వైపు వెళుతుండగా రెండు రోజుల క్రితం రావికంపాడు అడ్డరోడ్డు వద్ద ప్రధాన రహదారి పక్కన మరమ్మతుల వల్ల నిలిచిన సరుకు రవాణా వాహనాన్ని వెనుక నుంచి ఆటోతో ఢీకొట్టాడు. ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడగా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వృద్ధురాలు స్వల్ప గాయాలతో బయటపడింది.

పర్యాటక కేంద్రాల అభివృద్ధితో ఆదాయం

● అసెంబ్లీలో వివరించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. శాసనసభ సమావేశాలలో బుధవారం ఆయన పలు విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. పర్యాటక కేంద్రం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించవచ్చునని చెప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉన్న బాపట్లలోని సూర్యలంక బీచ్‌కు నిత్యం హైదరాబాద్, విజయవాడ పరిసర ప్రాంతాలు నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారన్నారు. బాపట్ల, నిజాంపట్నం ఓడరేవు పరిసరప్రాంతాలలో సముద్రంలో కలిసే అనేక లోతైన కాల్వలు కూడా ఉన్నాయన్నారు. బాపట్ల-చీరాల మధ్య రాజ దండు రోడ్డు బ్రిటీష్ కాలం నుంచి 80 అడుగుల రోడ్డుగా ఉందన్నారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ రోడ్డు, చీరాల ఓడరేవు రోడ్డుకు కలిపితే 10 నుంచి 12 స్టార్ హోటల్స్ ఈ ప్రాంతానికి వస్తాయన్నారు. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించటమేకాకుండా ప్రభుత్వానికి జీఎస్‌టి ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. సూర్యలంక బీచ్ ఎదురుగా 26 ఎకరాల పంచాయతీరాజ్ భూమి ఉందన్నారు. ఆ భూమిని టూరిజం కింద మార్చాలని కోరినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ద్వారా టోల్‌గేట్ పెట్టి అభివృద్ధి చేస్తున్నామన్నారు. టూరిజం కార్యాలయాన్ని బాపట్లలో ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. టూరిజంకు కేటాయించిన నిధులు జవాబుదారితనంతో ఖర్చు చేస్తే సంవత్సరానికి 20 నుండి 30 రెట్ల సంపద రాష్ట్రానికి వస్తుందని వేగేశన నరేంద్రవర్మ అభిప్రాయపడ్డారు.



పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన కంపోస్టు ప్రాసెసింగ్ యూనిట్

ప్రాసెసింగ్ యూనిట్‌తో దుర్వాసన

● వేరే ప్రాంతానికి తరలించాలని పట్టణ వాసుల వినతి

రేపల్లె, మార్చి5(ఆంధ్రజ్యోతి) : కూరగాయల మార్కెట్‌లో వద్ద గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ అధికారులు తడి, పొడి చెత్త ప్రాసెసింగ్ చేసే యూనిట్‌ను నెలకొల్పారు. దీని కారణంగా వ్యర్థాలన్నీ కుళ్ళిపోయి దుర్వాసన రావటంతో పాటు దోమలు విపరీతంగా పెరిగి అంటువ్యాధులు, విషజ్వరాలబారిన పడుతున్నామంటూ పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. చుట్టు పక్కల వారు గృహాల్లో ఉండే పరిస్థితి లేదని, రాత్రి వేళల్లో మరింత దుర్వాసనతోపాటు దోమలతో నిద్రపోని రాత్రులు ఎన్నో గడపాల్సిన పరిస్థితి ఉందని తెలుపుతున్నారు. మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ యూనిట్‌ను ఊరు బయటకు తరలించాలని లేకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొందని పట్టణవాసులు కోరుతున్నారు.

విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను అందజేస్తున్న ఆదర్శవేదిక సభ్యులు

రేపల్లె, మార్చి5(ఆంధ్రజ్యోతి) : రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా ఉత్తమ ఫలితాలను సాధించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని ఆంధ్రరత్న ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షా మెటీరియల్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పదవ తగరతిలో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. హెచ్ఎం మిర్యాల ప్రమీల, పట్టణ ఆదర్శవేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్, అధ్యక్షుడు బీవీ మోహన్‌రావు, ఆనందరావు, వెంకటేశ్వరరావు, సాయి కృష్ణమాచార్యులు, కె.నటరాజ్, సుందరరావు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలి

● పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జనార్ధనరావు



వేమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పశు సంవర్ధక శాఖ పశువుల బీమా పథకాన్ని పశుపోషకులకు వివరించి అమలు పరిచేందుకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సహాయ సంచాలకుడు డాక్టర్ జనార్ధనరావు తెలిపారు. ఆయన బుధవారం వేమూరులో గాలికుంటు టీకాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పశుపోషకుడైన రైతు తమ పశువులకు తప్పనిసరిగా బీమా అమలయ్యే విధంగా శ్రద్ధ చూపాలన్నారు. రైతు 20 శాతం చెల్లిస్తే రూ.30 వేల దాకా సంబంధించిన పశువులకు బీమా లభిస్తుందన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి కలిగిన బీమా ద్వారా సంబంధించిన పశువు మరణిస్తే రూ.30 వేలు బీమా రూపంలో ఆర్థిక సహాయం అందుతుందన్నారు. రూ.లక్ష విలువ కలిగిన పశువులకు రూ.5632 బీమా చెల్లించాల్సి ఉండగా రైతు వాటా కేవలం రూ.1536 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాంటి పశువుకు రూ.లక్ష బీమాను అందజేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 52150 పశువులకు గాలికుంటు టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

❖ ఆశాజనకంగా పంట ❖ శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులకు అవకాశం

జీడి పండు.. పూత మెండు!


జీడిమామిడి కాయలు




జీడిమామిడి చెట్లకు పూసిన పూత, పిందె


బాపట్ల పరిశోధనా స్థానంలో జీడిమామిడిచెట్లు

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అత్యధిక పోషక విలువలు కలిగి ఉండటమే కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న జీడిమామిడి పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. సకాలంలో పూత, పిందె వచ్చింది. మంచు కూడా తగ్గుముఖం పట్టడంతో పూత, పిందె నిలబడి కాయ కాస్తుంది. దీంతో ఈ ఏడాది ఆశించిన దానికంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం వారు 1955 నుంచి ఇక్కడ మేలు రకాల జీడిమామిడి రకాలను రూపొందిస్తున్నారు. అఖిల భారత సమన్వయ జీడిమామిడి పరిశోధన పథకం కింద 60 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు పెంచి కొత్త వైరటీలను రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు 10 రకాల జీడిమామిడి మొక్కలను తయారు చేశారు. అందులో బీపీపీ-7 మినహా బీపీపీ-1 నుంచి బీపీపీ-11 వరకు ఈ రకాలను ఆధునికీకరించారు. వీటిల్లో బీపీపీ-8,9 రకాలు అధిక దిగుబడులు ఇస్తున్నాయి. ఒక్కొక్క చెట్టు నుంచి 15 నుంచి 20 కేజీల గింజలు వస్తున్నాయి. కిలో గింజలు రూ. 120 నుంచి రూ. 150 వరకు పలుకుతుంది. 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జీడిమామిడి చెట్లను ప్రతి ఏడాది వేలంపాట ద్వారా రైతులకు ఇస్తుంటారు. గత ఏడాది రూ. 7.75 లక్షల ఆదాయం వచ్చినట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు.

నివారణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం జీడిమామిడి చెట్లలో ఆకు ముడత, ఆకుకత్తెరించే పురుగు, గూడు కట్టుట వంటివి ఆశిస్తున్నట్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి అందులో 19-19-19 రకం 5 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకొని నివారించుకోవాలని సూచించారు. పిందె దశలో ఉన్న తోటల్లో చెట్టుకు 200 లీటర్ల నీటిని అందిస్తే పిందెశాతం పెరిగి అధిక దిగుబడికి దోహదం పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1.32 లక్షల హెక్టార్లల్లో జీడిమామిడి సాగు చేస్తున్నారు. వీటి ద్వారా లక్షా 20 వేల మెట్రిక్‌టన్నుల జీడిగింజలు ఉత్పత్తి అవుతున్నాయి. రైతులు సెప్టెంబరు, అక్టోబరు నెలలో ఎరువు అందించకపోతే పూత, పిందె దశలో 19-19-19 రకం ఎరువును లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పూత, పిందె, కాయ దశలో పిచికారి చేసుకొని దిగుబడులు సాధించవచ్చు. ఇక్కడ పెంచిన మొక్కలకు అంటుకట్టి రైతులకు జూన్ నెల నుంచి విక్రయిస్తామని శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రతి ఏడాది 40 వేల మొక్కలు ఒక్కొక్కటి రూ. 50 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.


రైతులకు విక్రయించేందుకు శాస్త్రవేత్తలు పెంచుతున్న జీడిమామిడి మొక్కలు

జీడిపండు నుంచి పౌడర్ తయారీ

-శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు



జీడిగింజలే కాకుండా జీడిపండు రసం నుంచి పౌడర్ తయారు చేసి ఏడాదిలో ఎప్పుడైన జ్యూస్‌గా కలుపుకొని తాగవచ్చు. జీడిపండు రసం ఎక్కువ రోజులు నిల్వ ఉండదు కనుక దీనిని అభివృద్ధి చేశాం. దీనికి పెటెంట్‌కు కూడా రానుంది. ఇప్పటికే పబ్లిష్ అయింది. ఇండియన్ పెటెంట్ కార్యాలయంలో పెటెంట్ జర్నల్స్‌లో ప్రచురించారు. పూర్తిగా గ్రాంట్ అవ్వాల్సి ఉంది. ఇది పూర్తి చేస్తే జీడి గింజలతోపాటు జీడిపండుకు కూడా డిమాండ్ వచ్చే అవకాశం ఉంది.

నేటి నుంచి గుడారాల పండుగ

దయాక్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన విశ్వాసులు
లేమల్లె ప్రాంగణంలో హోసన్న మందిరం ప్రారంభం

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలం లేమల్లె గ్రామపరిధిలో జరిగే హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగే 48వ గుడారాల పండుగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఈ పండుగకు బుధవారానికే వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా విశ్వాసులు తరలివచ్చారు. దీంతో లేమల్లె ప్రాంగణంలోని దయాక్షేత్రం కిటకిటలాడింది. గుడారాల పండుగ ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం దయాక్షేత్రంలో నూతనంగా నిర్మించిన హోసన్న మందిరాన్ని ప్రారంభించారు. చెన్నైకు చెందిన పాస్టర్ మోహన్‌సీ లాజరస్, హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ అనిల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం


హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహంతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

సౌత్‌ఆఫ్రికాకు చెందిన జాషువా మోజస్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. జాన్‌వెస్లీ తదితరులు గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రమేష్, రాజు, ఫైడిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బందోబస్తు : ఎస్పీ శ్రీనివాసరావు

గురువారం నుంచి లేమల్లె గ్రామపరిధిలో జరిగే గుడారాల పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన దయాక్షేత్రం ప్రాంగణాన్ని సందర్శించి పండుగకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. స్టేజీలు, భోజనశాలలను పరిశీలించి హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్‌పాస్టర్ జాన్‌వెస్లీలతో పండుగ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవుని ప్రసంగాలతో పాటు విశ్వాసులలో సైబర్ నేరాల పై అవగాహన కలిగేలా సూచనలు ఇవ్వాలన్నారు. పండుగ జరిగే నాలుగు రోజులు ప్రాంగణంలో సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో పర్యవేక్షణ చేస్తామన్నారు. అమరావతి- గుంటూరు రహదారిలో లేమల్లె వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ హనుమంతరావు, సీఐ అచ్చయ్య, ఎస్ఐ అమీర్ తదితరులు ఉన్నారు.

గుడారాల పండుగకు 25 ప్రత్యేక బస్సులు

గుంటూరు: లేమల్లెలో నిర్వహిస్తున్న గుడారాల పండుగకు ఆర్టీసీ గుంటూరు-1 డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం ఎమ్‌వీఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్, రైల్వేస్టేషన్ల నుంచి రూ.30 చార్జీతో గుడారాల పండుగ ప్రాంగణానికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విశ్వాసులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. పండుగ ముగిసే వరకు ప్రత్యేక బస్సులను అదనపు సిబ్బందితో అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

కొమ్మాలపాటిని.. ఎమ్మెల్సీ వరించేనా!

అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే పేరు
ఆశావహుల్లో జంగా సహా మరికొందరు నేతలు

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవులకు నోటిఫికేషన్ వెలువడటంతో కూటమి పార్టీలోని ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 20న ఎన్నికలు జరగనున్నాయి. సునాయాసంగా దక్కే ఆ పదవులను దక్కించుకునే కూటమి నేతల్లో అదృష్టవంతులెవరనే దానిపై ఊహాగానాలు జోరందుకున్నాయి. జనసేనకు ఒకటి మినహాయిస్తే మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ పదవులను టీడీపీకే కేటాయించే ఉద్దేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. ఆ నాలుగింటిలో ఒక పదవి కీలకమైన ఉమ్మడి గుంటూరు జిల్లాకు దక్కే అవకాశం ఉంది. ఆ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఇచ్చే అవకాశం ఉందని ఇప్పటికే ఊహాగానాలు వెలువడ్డాయి. గత సాధారణ ఎన్నికల్లో తాను పోటీ చేయాల్సిన పెదకూరపాడు నియోజకవర్గాన్ని యువత కోటాలో భాష్యం ప్రవీణ్ పోటీ చేసే అవకాశం కల్పించి, ఆయన విజయానికి శ్రీధర్ పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పర్యటనలో చంద్రబాబు సభాముఖంగా కొమ్మాలపాటికి పదవిపై హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయనకు పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. దీంతో శ్రీధర్ ఎమ్మెల్సీ పదవి రేసులో అందరికంటే ముందున్నారని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ సీటును బీసీలకు ఇవ్వాలనే అధిష్ఠానం ఆలోచనతో అప్పటి వరకు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు వహిస్తున్న కోవెలమూడి రవీంద్ర(నాని) సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవికి ఆయన పేరును కూడా అధిష్ఠానం పరిశీలించే అవకాశం ఉంది. అయితే నగరపాలక సంస్థలో టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరిస్తున్న నానికి త్వరలో కూటమి వశం కానున్న మేయర్ పీఠాన్ని కట్టబెట్టాలని యువనేత నారా లోకేశ్‌తో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా భావిస్తున్నారు. నానికి కూడా ఆ ఆలోచన ఉండటంతో ఏం జరుగుతుందో చూడాలి. గతంలో కూడా పార్టీ సుప్రీం చంద్రబాబునాయుడు కూడా ఒకటి రెండు సార్లు నానికి ఎమ్మెల్సీ ఇవ్వాలని ఆలోచన చేసినా చివరి నిమిషంలో సమీకరణలు మారి అవకాశం చేజారింది. ఈ పర్యాయం ఆయన మేయర్ పదవి వైపు అడుగులు వేస్తారో లేక ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తూ ఆశావహుల జాబితాలో నిలుస్తారో చూడాలి. ఇక రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాష్టారు కూడా ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తూ నాయకుల సిఫార్సులు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఎన్నికల సమయంలో వైసీపీ హయాంలో తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదులుకుని టీడీపీలో చేరిన గురజాల ప్రాంతానికి చెందిన జంగా కృష్ణమూర్తి పేరు కూడా పరిశీలన ఉన్నట్టు ఊహాగానాలు వెలువడుతున్నాయి. అయితే ఆయనకు ఇప్పటికే ఎంతో కీలకమైన తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా పదవిని కట్టబెట్టిన విషయం తెలిసిందే.


కొమ్మాలపాటి శ్రీధర్


కోవెలమూడి నాని


జంగా కృష్ణమూర్తి

వైద్య వృత్తి ప్రమాణాలను పాటించండి!

- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- ఘనంగా కాటూరి వైద్య కళాశాల స్నాతకోత్సవం

గుంటూరు మెడికల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని సేవా నిరతితో నిర్వహిస్తామని, రోగులకు ప్రేమ, సానుభూతితో వైద్య సేవలు అందిస్తామని చేసే హిపోక్రాటిక్ ప్రమాణాలను వైద్యులు జీవితాంతం పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. చినకోండ్రుపాడులోని కాటూరి వైద్య కళాశాలలో బుధవారం రాత్రి జరిగిన 2019 బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం 'సంవర్తన'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువ వైద్యులకు ఎంబీబీఎస్ పట్టాలను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వైద్య వృత్తి క్రమేపీ వ్యాపారమయంగా మారుతున్నట్లు తెలిపారు. 'వైద్య వృత్తిలోకి ఏ స్ఫూర్తితో ప్రవేశించారో అదే స్ఫూర్తితో పేద రోగులకు వైద్య సేవలు అందించండి. చిరు నవ్వుతో రోగుల సమస్యలు వినండి, చక్కటి చికిత్సలు చేయండి. రోగుల ముఖంపై చిరునవ్వును ఆవిష్కరించండి' అంటూ సత్యకుమార్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు యువ వైద్యులు ఆసక్తి చూపడం లేదని మంత్రి తెలిపారు. "ఇటీవల మెడికల్ పీజీ విద్యార్థులకు డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ కింద మూడు నెలల పాటు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసేందుకు పోస్టింగ్‌లు ఇచ్చాం. చాలా మంది పీజీలు తాము ఆయా ఆరోగ్య కేంద్రాల్లో పని చేయమని, తమ ప్రాంతంలో ఆసుపత్రిలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని నాపై పెద్దఎత్తున రాజకీయసిఫార్సులు తెస్తు న్నారు. ఈ సిఫార్సులను నేను ఆమోదించ లేదు. మూడు నెలల పాటు వైద్యులు గ్రామీణ ప్రాంతా ల్లో పని చేస్తే అక్కడి రోగుల ఇబ్బందులు తెలుస్తాయని" సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ కింద రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు త్వరలో ర్యాంకింగ్‌లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.



వైద్య పట్టాను ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రైవేటు వైద్య రంగానిది కీలక పాత్ర..

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే ప్రభుత్వ వైద్య రంగంతో పాటు ప్రైవేటు వైద్య రంగం భాగస్వామ్యం అవసరమని ఆరోగ్య శాఖ మాజీ మంత్రి, కైకలూరి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. వైద్యులు నిరంతరం విద్యార్థుల్లా ఉండాలన్నారు. రోగుల పట్ల సేవాభావంతో మెలగాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యా యని, ఇటువంటి పరిస్థితుల్లో వైద్య రంగం బలోపేతం చేసేందుకు మంత్రి సత్యకుమార్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కామినేని తెలిపారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ చైర్మన్ కాటూరి సుబ్బారావు, జీఎస్ఎల్ గ్రూపు సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర రావు, డాక్టర్ మాదాల శ్రీనివాసరావు, కేఎంసీ డీన్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, ఎండీ డాక్టర్ స్వైరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత విద్యుత్.. వెలుగులు

- ప్రాథమిక పాఠశాలకు రూ. 20 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.50 వేలు
- బడ్జెట్‌లో నిధులు కేటాయింపుతో హెచ్‌ఎంల హర్షం



గుంటూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ వెతలు తీరనున్నాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు త్వరలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకు అయ్యే వ్యయం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.175 కోట్లు కేటాయించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు దాదాపు 4500పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 6.45 లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల్లో విద్యుత్ కీలకం. ప్రతి స్కూల్‌లో మరుగుదొడ్లకు అవసరమైన నీటి కోసం బోరు, మంచినీటి కోసం వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇంకా ప్రతి తరగతి గదిలో సగటున రెండు ఫ్యాన్లు, ట్యూబులైట్లు, డిజిటల్ ప్యానల్ బోర్డులు ఉన్నాయి. ప్రతి స్కూల్‌లోని ఆఫీసులో కంప్యూటర్స్ ప్రింటర్, జిరాక్స్ మిషన్ ఇలా అనేక విద్యుత్ ఉపకరణాలు ఉన్నాయి.



స్కూల్ గ్రాంట్ సక్రమంగా విడుదల చేయకపోవడంతో..

ప్రాథమిక పాఠశాలలకు సగటున నెలకు రూ.1000 నుంచి రూ.1500, ఉన్నత పాఠశాలలకు సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేలపైన ప్రతి నెలా విద్యుత్ బిల్లు వస్తోంది. ఈ విద్యుత్ బిల్లు ఇప్పటి వరకు స్కూల్ గ్రాంట్ నుంచి చెల్లించేవారు. గత ప్రభుత్వ హయాంలో స్కూల్ గ్రాంట్ సక్రమంగా విడుదల చేయలేదు. దీంతో అనేక స్కూల్స్‌లో విద్యుత్ బిల్లులు వేలల్లో పెండింగ్ ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా ఫ్యూజులు తీసుకెళ్లడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రాంట్స్ విడుదల చేయడంతో విద్యుత్ బిల్లులు క్రమంగా చెల్లించుకుంటూ వస్తున్నారు. ఎన్నికల హామీలో భాగంగా పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించి బడ్జెట్‌తో నిధులు కేటాయించారు.

ప్రధానోపాధ్యాయుల హర్షం

పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంపై ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతినెలా విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం తీవ్ర హైరానా పడాల్సి వచ్చేదని చెబుతున్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఫ్యూజులు తీసుకెళ్లేవారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్కూల్ గ్రాంట్ నిధులు రావడంతో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, ఉచిత విద్యుత్ అమలు చేస్తే పాఠశాలలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ భారం నుంచి ఉపశమనం



పాఠశాలలకు ఉచిత విద్యుత్‌లో భాగంగా ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.50 వేలు వరకు ప్రభుత్వం చెల్లించనుంది. ఇందుకోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. త్వరలో అన్ని ప్రభుత్వ స్కూల్స్‌కు ఉచిత విద్యుత్ పథకం అమలు కానుంది.

-తిరుమలేష్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు

తిరునాళ్ల ఏర్పాట్లపై కసరత్తు

- శింగరకొండలో ప్రారంభమైన హడావుడి
- నేడు ఆర్డీవో అధ్యక్షతన అధికారులతో సమన్వయ సమావేశం
- ఆలస్యమైన కోఆర్డినేషన్ మీటింగ్
- ప్రత్యేక దృష్టి సారిస్తేనే పనులు పూర్తి

అద్దంకి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. తిరునాళ్ల ఉత్సవాలు 12వ తేదీన ప్రారంభమై, ప్రధాన తిరునాళ్ల 14వ తేదీ జరగనుంది. ప్రధాన తిరునాళ్ల రోజు విద్యుత్ ప్రభల ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన గురువారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేవం జరనుంది. ఏటా తిరునాళ్ల ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించేందుకు కనీసం 20 నుంచి 15 రోజుల ముందుగానే తొలి కో-ఆర్డినేషన్ మీటింగ్ జరిగేది. అనంతరం వారం రోజుల ముందు రెండవ విడత కో-ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసి ఆయా శాఖల పరిధిలో పనులు ఏమేరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వెంటనే పూర్తికి తీసుకోవాల్సిన చర్యల పై సమీక్ష నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది తిరుణాళ్ళ వారం రోజుల గడువు మాత్రమే తొలి విడత సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులు పూర్తి చేసేందుకు అతి తక్కువ సమయం మా త్రమే ఉన్నందున పనులు పూర్తి చేయటం పై ఒకింత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. రెండవ విడత సమావేశం 10 వ తేది జరిగే అవకాశం ఉండటంతో నాలుగు రోజుల వ్యవధిలోనే అత్యధిక శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంది.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వ్యూ



శింగరకొండ వద్ద తిరునాళ్లకు సిద్ధం చేస్తున్న జెయింట్‌వీల్స్, రంగులరాట్నాలు

శింగరకొండ వద్ద రంగులరాట్నం, జయింట్ వీల్స్ లు ఏర్పాటు పనులు ప్రారంభం కావటం తో తిరుణాళ్ళ హడావుడి కనిపిస్తుంది. ఇక అన్ని సామాజిక వర్గాల అన్నదాన స త్రాలలో తిరుణాళ్ళ సందర్భంగా 14 వ తేది ఉదయం నుండి అర్ధరాత్రి దాటే వరకు భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు ఆయా స త్రాల నిర్వహకులు ఏర్పాట్లు లో నిమగ్నమయ్యారు.



పరిశీలిస్తున్న వీఆర్వో సుజాత

వాగును ఆక్రమించి.. మెరక తోలి

పరిశీలించి నిలిపేయించిన వీఆర్వో

అద్దంకి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏ చిన్నపాటి ప్రభుత్వ భూమి కనిపించినా కబ్జా చేసేందుకు ఆ క్రమణదారులు కాసుకొని కూర్చుంటున్నారు. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలో ఊరచెరువు కు నీరు చేరే వాగు ఇప్పటికే పెద్ద ఎత్తున ఆ క్రమణలకు గురి కాగా, తాజా గా మరి కొంత భాగం ను ఆ క్రమించి మెరక తోలుతున్నారు. వర్షాల సమయంలో నీరు ప్రవహించటం తో పాటు చెరువు లో నీరు లేనప్పుడు సాగర్ కాలువ నుండి నీటిని పెట్టిందుకు కూడా ఈ వాగు ను వినియోగిస్తున్నారు. అయితే ఎక్కడికక్కడ ఆ క్రమణలకు గురవుతూ ఇప్పటికే పలు చోట్ల వాగు వెడల్పు తగ్గిపోయింది. ఈ క్రమంలో చెరువు సమీపంలో కొత్తగా వాగు ను ఆక్రమించనుండటంతో నీటి ప్రవాహం కు మరింత అడ్డంకి గా మారే అవకాశం ఉందని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. విషయం తెలుసుకున్న విఆర్ఓ సుజాత పనులను నిలిపి వేయించారు. అయితే తాత్కాలికంగా పనులు నిలిపి వేసినా ఎదో ఒక విధంగా అధికారుల కళ్ళు గప్పి ఆ క్రమించి నిర్మాణాలు చేస్తారనే అభి ప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగు లో ఇప్పటికే ఉన్న ఆ క్రమణలు తొలగించటం తో పాటు కొత్త గా జరిగే ఆ క్రమణలు నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

మంచి నీటి చెరువులను నింపుతున్నాం

బల్లికురవ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో గ్రామాలలో మంచి నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రణాళికతో జిల్లాలోని అన్ని గ్రామాల తాగు నీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుతున్నామని జిల్లా అర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎం.అనంతరాజు తెలిపారు. బుధవారం బల్లికురవ మండలం అంబడిపూడి సీపీడబ్ల్యూ రక్షిత మంచి నీటి పథకాన్ని ఎస్‌ఈ పరిశీలించారు. ఈసందర్భంగా అయన రక్షిత స్టోరేజీ చెరువు కట్టను, నీటి క్లోరినేషన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో ఉన్న తాగు నీటి పథకాలను వినియెగంలోకి తీసుకు వచ్చే చర్యలు చేపడుతున్నామన్నారు. అలానే అంబడిపూడి పథకం ద్వారా ఆరు గ్రామాలకు తాగు నీరు అందుతుందని ఈ పథకం చాలా బాగుందన్నారు. త్వరలో ఈ పథకం ద్వారా నీరు అందే గ్రామాలలో ప్రత్యేక ట్యాంకులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో డీఈ ఏ శ్రీనివాసులు, ఏఈ గిరినాయక్, టీడీపీ నాయకులు మందలపు సుధాకర్ పాల్గొన్నారు.

సారా తయారీపై ఉక్కుపాదం



సమావేశంలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు

చీరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీపై ఉక్కుపాదం మోపుతామని, తయారీదారులు ఇకపై ఆపకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఒంగోలు బాపట్ల అధికారులు విజయ, జనార్దనరావు, వెంకటేశ్వర్లు, అన్నారు. బుధవారం స్థానిక రామనగర్ న్యూ కాలనీలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించి కౌన్సెలింగ్ చేశారు. తయారీ నిలుపకుంటే శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

దుకాణాలకు లాటరీలు

చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల గీత కులస్థుల మద్యం దుకాణాలకు గతంలో ఉత్తర్వులు వెలవడినట్లు సీఐ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే చీరాల 12, కారంచేడు 8, వేటపాలెం 21 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. వాటికి సంబంధించి నేడు బాపట్ల కలెక్టరేట్ పీజీఆర్ఎస్ కాంపౌండ్‌లో లాటరీ పద్ధతిలో నిర్వహణ జరుగుతుందని అన్నారు. దరఖాస్తు దారులు కుల్రధ్రువీకరణ, ఆన్‌లైన్ చేసిన రశీదుతో హాజరు కావాలని తెలిపారు.

నిరుద్యోగులను గుర్తించండి

చీరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్‌పార్టనర్‌షిప్) సర్వేను నిశితంగా నిర్వహించి నిరుద్యోగులను గుర్తించాలని వేటపాలెం ఎంపీడీవో రాజేష్ ,చీరాల మండలం ఈవోఆర్డీ రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయా కార్యలయాలలో సచివాలయ సిబ్బందితో సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వే వలన నిరుద్యోగం శాతం తగ్గించే అవకాశంతో పాటు ఎందరికో ఉపాధి అందుతుందని చెప్పారు.

నేడు తిరునాళ్లపై సమావేశం

అద్దంకి, మార్చి5(ఆంధ్ర జ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ల ఏర్పాట్లపై చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు శింగరకొండ లో జరుగుతుందని తహసీల్దార్ శ్రీచరణ్, ఈవో తిమ్మానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజలు హజరై తగు సలహాలు, సూచనలు చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

అద్దంకి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో ఇసుక అ క్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని తహసీల్దార్ వద్ద హాజరుపరచగా, రూ.5వేల అపరాధ రుసుము విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. మండలంలోని తిమ్మాయపాలెం వద్ద గుండ్లకమ్మ నదిలో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా బుధవారం ట్రాక్టర్ ను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ శ్రీచరణ్ వద్ద హాజరు పరచగా రూ.5వేల అపరాధ రుసుము విధించినట్లు తెలిపా రు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ సుబ్బరాజు తెలిపారు.

వైసీపీ మండల కన్వీనర్ నియామకం

ఇంకొల్లు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మండల కన్వీనర్‌గా చిన్ని పూర్ణారావును నియమించారు. ఈమేరకు బుధవారం కేంద్రపార్టీ కార్యాలయం నుంచి నియామకపత్రం అందినట్లు పూర్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని పూర్ణారావు అన్నారు.

యాంత్రీకరణతో సాగు ఖర్చులు తగ్గించవచ్చు

అద్దంకిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై అందిస్తామని తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఇంకొల్లు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని న్యూఢిల్లీ సెంట్రల్ టీం వైద్యుడు డాక్టరు రమణ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సెంట్రల్ వైద్య బృందం బుధవారం సందర్శించింది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, రాష్ట్రీయ కిషోర్ స్వస్థ కార్యక్రమం అమలును పరిశీలించారు. టీం పాన్ ఇండియా స్టడీ తరుపున డాక్టర్లు రమణ, పాదాలు, సాదిక్, భూషణ్, జిల్లా ఎస్‌టీఎల్ఎస్ నరేంద్ర పాల్గొన్నారు. ప్రోగ్రామం అమలుతీరును పీహెచ్‌సీ డాక్టరు అంజలిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ మౌళి, ప్రభావతి, సహస్ర, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను తెలుసుకుంటున్న సెంట్రల్ టీం వైద్యులు

ఓపెన్ ఇంటర్‌లో ఐదుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు

ఒంగోలు విద్య, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు నిబంధనలకు విరుద్ధంగా సుదూర ప్రాంతాల నుంచి ఒంగోలులో ఇన్విజిలేటర్లుగా నియమితులైన ఐదుగురు ఉపాధ్యాయులను పరీక్షల విధుల నుంచి తొలగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న వారిని ఇన్విజిలేటర్లుగా నియమించాలి. అయితే 100 కిలోమీటర్ల దూరం నుంచి ఇన్విజిలేటర్లను ఒంగోలులో నియమించారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల, బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రాల్లో సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించారు. మార్కాపురం డివిజన్‌కు చెందిన వారిని ఆ డివిజన్‌లోనే నియమించాల్సి ఉండగా అక్కడి వారిని ఒంగోలులో నియమించారు. దీని వెనుక ఏమి మతలబు జరిగిందో తెలియదు కాని నిబంధనలకు తూట్లు పొడిచారు. ఒంగోలులోని ఈ రెండు కేంద్రాల్లో పుల్లలచెరువు, దొనకొండ, తాళ్లూరు, ఈదర పాఠశాలల నుంచి ఐదుగురు టీచర్లను నియమించారు. వీరిలో ముగ్గురిని డీఈవో గుర్తించి వారిని వెంటనే రిలీవ్ చేయాలని సంబంధిత చీఫ్‌లు, డీవోలను ఆదేశించారు. డీఈవో ఆదేశాల మేరకు మొత్తం ఐదుగురిని పరీక్షల విధుల నుంచి తప్పించి వారి స్థానంలో ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు సూచించిన వారిని ఇన్విజిలేటర్లుగా నియమించారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్ఐ రవితేజ

క్రమశిక్షణతో చదువుకోవాలి

అద్దంకిటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆ శలను వమ్ము చేయకుండా క్రమశిక్షణతో చదువుకుని అందిపుచ్చుకోవాలని ఎస్ఐ కె. రవితేజా అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలల్లో భాగంగా స్థానిక ఎన్‌టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలకు నిర్వహి ంచిన డిబెట్, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బుధవారం ఎస్ఐ పాల్గొన్నారు. చదువుకున్న విద్యార్థులుగా ఎ లాంటి మోసాలకు గురి కాకుండా ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఇతరులకు తెలియజేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి ఇతరులకు మీరు అ వగాహన కల్పించి, వారు ఎటువంటి మోసాల భారిన పడకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా డిబెట్, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థినీలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్తయ్య, కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై ముమ్మర ఏర్పాట్లు

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తిరిగిన యంత్రాంగం
- ఎస్‌వీకేపీలో మహిళా దినోత్సవం
- దరిమడుగు వద్ద పార్టీ కార్యకర్తల సమావేశం
- పరిమిత సంఖ్యలోనే జనసమీకరణకు సీఎంవో ఆదేశం



ఎస్‌వీకేపీ కాలేజీలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా అధికారులు

మార్కాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం వస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పలువురు జిల్లాస్థాయి అధికారులతో కలిసి బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సభాస్థలి, కార్యకర్తల సమావేశం, హెలీప్యాడ్ స్థలాల కోసం పరిశీలన చేశారు. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఏకబిగిన తిరుగుతూ ఐదు ప్రాంతాలను పరిశీలించారు. మహిళాదినోత్సవానికి 3వేల మంది, కార్యకర్తల సమావేశానికి 400 మందికి మించి జనసమీకరణ చేయవద్దని సీఎంవో నుంచి ఆదేశాలు అందాయి. అందుకనుగుణంగానే అధికారులు కూడా పలు ప్రాంతాలను పరిశీలించారు. ఒంగోలు నుంచి మార్కాపురం చేరుకునే క్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా తొలుత మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామం వద్ద మెడికల్ కళాశాల సమీపంలోని పొలాలను పరిశీలించారు. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్‌లు వేసి ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతాయని గమనించారు. అక్కడ నుంచి ఎస్‌వీకేపీ కళాశాల మైదానంలోకి చేరుకుని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం తర్లుపాడు రోడ్డులోని సాయి బాలాజీ స్కూల్ సమీపంలోని పాత హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి తర్లుపాడు మండలం సీతానాగులవరంలోని రెండు ప్రాంతాలను పరిశీలించారు. అంతా బాగానే ఉన్నా ప్రధాన రహదారి పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో విరమించుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని హెలీప్యాడ్ స్థలాన్ని మారిస్తే బాగుంటుందని భావించారు. బోడపాడు రహదారిలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌ను పరిశీలించి అనువైనదిగా గుర్తించారు. కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక సమావేశానికి సంబంధించిన స్థలాన్ని దరిమడుగు గ్రామం వద్ద గుర్తించారు. అనంతరం మళ్లీ ఎస్‌వీకేపీ కళాశాల వద్దకు చేరుకుని మహిళా దినోత్సవాన్ని కాలేజీలో, కార్యకర్తల సమావేశాన్ని దరిమడుగులో, హెలీప్యాడ్‌ను బోడపాడు రోడ్డులో ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. అవసరమైన చర్యలు ఎలా తీసుకోవాలో పలువురు జిల్లా అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు సూచించారు. వెంటనే ఆయా ప్రాంతాల్లో పనులు కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివి నాగ్, జడ్పీ సీఈవో చిరంజీవి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తదితర అధికారులు పాల్గొన్నారు.

పర్యటనను విజయవంతం చేయాలి

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న కార్యక్రమానికి సంబంధించి స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో బుధవారం అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ రాష్ట్ర స్థాయి కార్యక్రమం మార్కాపురంలో జరుగుతోందన్నారు. కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి కేటాయించిన విధులను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ప్రధానంగా సభాస్థలంలో వేదిక, బారికేడ్లు, వీఐపీ, సాధారణ ప్రజల పార్కింగ్, మహిళల స్టాల్స్ ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమం అయినందున ఇతర జిల్లాలకు చెందిన మహిళా అచీవర్స్, వివిధ శాఖల హెచ్‌వోడీలు వస్తున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు. సీఎం సందర్శించే స్టాల్స్‌పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.



అద్దంకిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తున్న నామ్ సిబ్బంది

సిగ్నల్ లైట్లు ఏర్పాటు, మరమ్మతులు

అద్దంకి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వార్షిక తిరునాళ్ల నేపథ్యంలో నామ్ రోడ్డులో ఇప్పటికే మరమ్మతులకు గురైన సిగ్నల్ లైట్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. సీఐ సుబ్బరాజు ఇటీవల నామ్ రోడ్డు నిర్వహణ అధికారులను సంప్రదించి సిగ్నల్ లైట్లు విషయం చర్చించారు. దీంతో అద్దంకి పట్టణంతో పాటు శింగరకొండ వరకు నామ్ రోడ్డులో వివిధ ప్రాంతాలలో సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు.

విద్యుత్ ప్రభల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలి

నేటితో ముగియనున్న గడువు

అద్దంకి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్లకు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసే నిర్వాహకులు గురువారంలోపు పోలీస్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని అద్దంకిటౌన్ సీఐ సుబ్బరాజు తెలిపారు. విద్యుత్ ప్రభల నిర్వహకులు ఒక్కొక్క ప్రభకు పది మందికి తక్కువ కాకుండా కమిటీగా ఏర్పడాలని కోరారు. పోలీస్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అసభ్యకర మాటలు, రెచ్చగొట్టే ప్రసంగాలు తిరునాళ్లలో చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మణికేశ్వరం స్వామి కానుకల లెక్కింపు

అద్దంకి, మార్చి5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయం హుండీల కానుకలను బుధవారం లెక్కించారు. గత మార్చి నుంచి బుధవారం వరకు హుండీల ద్వారా వచ్చిన కానులను బుధవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఈవో గుంటుపల్లి వాసుబాబు ఆధ్వర్యంలో లెక్కించగా రూ.1,31,828 వచ్చాయి. పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కరిముల్లా, అంజయ్య, రామయ్య పాల్గొన్నారు.

కళాశాలకు వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ అందజేత

చీరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి ప్రకాశం అండ్ ప్రడగ కోటయ్య జూనియర్ కళాశాలకు వాకర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గుద్దంటి రమేష్‌బాబు రూ.15వేల విలువగల వాటర్ ప్యూరిఫైడ్ మిషన్‌ను అందజేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, బదరీనాథ్, శ్రీకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

మార్టూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న లారీ ముందు భాగంలో కిందికి పల్సర్ బైక్ దూసుకుపోవడంతో వాహనదారుడు బత్తుల రమేష్ (40) మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మార్టూరు సెంటరు నుంచి జొన్నతాళి రోడ్డుకు వెళ్లే సర్వీసురోడ్డులో జరిగింది. రమేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతని స్వగ్రామం మండలంలోని కోనంకి గ్రామం కాగా, గత కొన్నిరోజులుగా అతను కుటుంబంతో నేతాజీనగర్‌లో అద్దెఇంటిలో నివసిస్తున్నాడు. బల్లికురవ మండలంలోని వేమవరం దగ్గర గ్రానైట్‌లో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నారు. బల్లికురవ క్వారీ నుంచి జొన్నతాళి రోడ్డులో ఒక గ్రానైట్ పరిశ్రమకు ముడిరాయిని తరలిస్తున్న లారీకి,జొన్నతాళి రోడ్డువైపు నుంచి బైక్‌పై వస్తున్న రమేష్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లారీ కిందికి పల్సర్ బైక్ దూసుకుపోయింది. దీంతో రమేష్ మొఖం కూడా గుర్తుపట్టనంతగా నుజ్జునుజ్జయింది. జొన్నతాళి రోడ్డు వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోవాలాను తప్పించే క్రమంలో సైడుకు రావడంతో, ఈ విషయాన్ని గమనించకుండా ఎదురుగా వస్తున్న రమేష్ లారీని ఢీకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదం విషయం తెలియగానే సీఐ శేషగిరిరావు, ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషా సంఘటనా స్థలానికి వెళ్లి లారీ కింద నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. దాదాపుగా గంట తర్వాత మృతుని ఆచూకీ తెలిసింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రజా సమస్యలపై సర్వే

పంగులూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య అన్నారు. పంగులూరులో బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు నిత్యం అనేక సమస్యలతో సతమవుతున్నారని, దీనిపై ఈ నెల 8 నుంచి 28 వరకు జిల్లా వ్యాపితంగా సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తలపనేని రామారావు, వినోద్‌బాబు, మండల కమిటీ సభ్యులు పూసపాటి సుబ్బరాజు, మానం హరిబాబు, ఏలియా పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రోటరీ చేయూత

అద్దంకిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోకి లోని హరి హర గోశాలను ప్రత్యామ్నాయంగా మరో చోటకు మార్పు చేస్తున్న నేపథ్యంలో అక్కడ కింద ఫ్లోరింగ్‌కు అవసరమైన సిమెంట్, కంకర, ఇతర మెటీరియల్‌ను రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. గోశాలకు తమ వంతుగా రోటరీ సభ్యుల సహాయ సహకారాలతో సాయం అందించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి సీహెచ్. మురళీసుధాకరరావు, పోకూరి శ్రీనివాసరావు, కొల్లా పవన్, గోశాల నిర్వాహకులు గోనుగుంట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పరిస్థితి అస్తవ్యస్తం

- దోమలు, కంపుతో దయనీయంగా ప్రజల మనుగడ
- దండుబాట రోడ్డులో విపరీతంగా ఆక్రమణలు
- కన్నెత్తి చూడని మునిసిపల్ అధికారులు

చీరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలోని వార్డుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజల జీవనం దయనీయంగా ఉంది. వార్డుల్లో ప్రధానంగా డ్రైనేజీ సమస్య స్థానికులను వేధిస్తోంది. కదలని మురుగుతో దోమలు పెరగడంతోపాటు తీవ్రమైన కంపుతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా 23, 25 వార్డుల్లో అంతర్గత రహదారులు శిథిలావస్థకు చేరాయి. డ్రైనేజీలు రహదారులకు ఒకవైపు మాత్రమే ఉన్నాయి. 23వ వార్డు వైకుంఠపురంలో పలు చోట్ల మురుగు కాలువలు మరమ్మతులకు గుర్యాయి. నీరు ముందుకు కదలక కంపు, దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25వ వార్డు ప్రకాష్‌నగర్‌లో కూడా చాలాచోట్ల రహదారులు ఘోరంగా మరమ్మతులకు గురి కాగా పెద్ద ఎత్తున పెచ్చులు రోడ్లకు అడ్డంగా ఉండడంతో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక్కడ పారిశుధ్య కార్మికులు విధిగా కాలువలను శుభ్రం చేస్తున్నారు. కానీ, ఆయిల్ బాల్స్ వంటి వినియోగం జరగడం లేదని స్థానికులు ఆరో పిస్తున్నారు. అలాగే దోమలు మందు పిచికారీ చేయడం లేదని, బ్లీచింగ్ ఊసే లేదని దీంతో కాలువలు కంప ుకొడుతున్నాయని అంటున్నారు.



ప్రకాష్‌నగర్ డ్రైనేజీ దుస్థితి



వైకుంఠపురంలో అధ్వానంగా డ్రైన్

పెరిగిన ఆక్రమణలు

చీరాల పురపాలక సంఘం పరిధిలోని దండుబాట రోడ్డులో సుమారు 2 కిలో మీటర్ల మేర ఆయా ప్రాంతాల ప్రజలు రోడ్డు మార్జిన్‌లు, డ్రైన్‌లను ఆక్రమించి కొందరు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. అయినా అధికారులు కన్నెత్తికూడా చూడడం లేదు. నివాసాలు ఏర్పాటు చేసుకునే వారు కొందరయితే, మరి కొందరు ఏకంగా శాశ్వత కట్టడాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. రోజు రోజుకు ఆక్రమణల పర్వం తార స్థాయికి చేరుతున్నా అధికారులు మౌనంగా ఉంటు న్నారు. ఇదే కొనసాగితే భవిష్యత్‌లో ఆక్రమణదారులకు అడ్డకట్ట వేయలేమని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, తక్షణమే మురుగు కాలువల మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నివారణ చర్యలు శూన్యం



కాలువ పూడికలు నిత్యం జరుగుతున్నాయి. అయితే పిచికారీ వంటివి లేనందున దోమలు ఆవాసాలను ఏర్పాటు చేసుకుని విజృంభిస్తున్నాయి. దీంతో దోమల బెడద అధికంగా ఉంటుంది. అలాగే అంతర్గత రహదారులు ఘోరంగా దెబ్బతిన్నాయి. నిర్మాణాలు జరగాలి.

\- మోహన్‌రావు, ప్రకాష్‌నగర్

డ్రైన్లు కంపు



వార్డుల్లో అనేక చోట్ల డ్రైన్‌లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో కాలువల్లో మురుగు పారక భరించలేని కంపు కొడుతోంది. వెంటనే మురుగు కాలువలను బాగు చేయాలి. రహదారులు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలి.

\- దోమ శ్రీదేవి
వైకుంఠపురం



బాలింతలకు పోషకాహారాన్ని అందజేస్తున్న సీడీపీవో ఝాన్సీ

చిన్నారులకు పోషకాహారం అందించాలి

చినగంజాం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో పోషకాహార లోపం తలెత్తకుండా పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని సీడీపీవో టీ.ఝాన్సీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంతరావూరు సెక్టారు పరిధిలోని కడవకుదురు-4 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్ననాటి సంరక్షణ, విద్యా డే, పోషకాహార లోపంతో ఉన్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్యక్రమంపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఆడపిల్లలకు చదువు చాలా ముఖ్యమని, 18 సంవత్సరాలు దాటిన తర్వాతే వివాహం చేయాలని సీడీపీవో సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లల ఎదుగుదల, పర్యవేక్షణ, ప్రాముఖ్యత గురించి వివరించారు. పిల్లల ఎత్తు, బరువును పరిశీలించి పోషణ స్థితిని గురించి తెలియజేసినట్లు సీడీపీవో తెలిపారు. ఇంటి దగ్గర తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు సీడీపీవో పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉష, అంగన్‌వాడీ కార్యకర్తలు గీత. శ్రావణి పాల్గొన్నారు.

భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



అన్నంబొట్లవారిపాలెంలో మొక్కజొన్న పరిశీలిస్తున్న ఏడీఏ మోహన్‌రావు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు భూసార పరీక్షలను చేయించి భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏవో ఎన్.మేరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసా పరీక్షల ద్వారా భూమికి సంబంధించి ఎరువుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పొలాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వీఏఏ మధుప్రియ, పలువురు రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం

పర్చూరు : మొక్కజొన్నలో కత్తెర పురుగపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, తొలిదశలో గుర్తిస్తే నివారణ సాధ్యమని ఏడీఏ ఎస్.మోహనరావు అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అన్నంబొట్లవారిపాలెం, తన్నీరువారిపాలెం గ్రామాల్లో మొక్కజొన్న పైర్లను ఏడీఏ వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. కత్తెర పురుగు పైరు మొదిటి దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్‌రెడ్డి, హేమవర్ధిని, లావణ్య, ఆదర్శ గ్రామ రైతులు పాల్గొన్నారు.

నల్ల బర్లీ కొనుగోలును ప్రారంభించాలి



తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

పంగులూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ పొగాకు కొనులగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి వెంటనే కొనుగోలును ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతు సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సింగారావుకు బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ ఏడాది రైతులు బర్లీ పొగాకుఉ అధిక విస్తీర్ణంలో సాగు చేశారని, అందులో నల్లబర్లీ సాగు అధికంగా ఉందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు అన్నారు. కంపెనీలు నల్లబర్లీ కొనులగోలు చేపట్టక పోవడంతో పొగాకు బేళ్లు ఇళ్లవద్దే మగ్గి పోతున్నాయన్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన రైతులు కంపెనీలు నల్లబర్లీ కొనుగోలు చేస్తాయో లేదా అనే ఆందోళనలో ఉన్నారని, ఈ దుస్థితిని సొమ్ము చేసుకునేందుకు దళారులు చూస్తున్నారన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న, శనగ, మిర్చికి గిట్టుబాటు ధరలేని పరిస్థితి నెలకుందన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ప్రభుత్వం పొగాకు రైతులు ఎదుర్కొంటున్న దుస్థితిని గుర్తించి కొనుగోలుకు తగిన చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తలపనేని రామారావు, తానికొండ సుధాకర్, మానం హరిబాబు, నందవరపు జాన్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాగునీరు, రైతుల సమస్యలు పరిష్కరించండి

- గత వైసీపీ రివర్స్ టెండరింగ్‌తో ఒరిగిందేమీ లేదు
- అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కొండయ్య



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలోని సాగునీటి సరఫరా, రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గుంటూరు కెనాల్ నుంచి సాగుకు అందుతున్న నీటికి సంబంధించిన సబ్ కెనాల్స్ దెబ్బతిన్నట్లు సభ దృష్టికి తీసుకు వచ్చారు. తూటాకు పేరుకుపోయి సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన వివరించారు. దెబ్బతిన్న కాలువలను సాధారణ స్థితికి చేర్చడానికి నిధులు లేవన్నారు. అంతేకాకుండా గత వైసీపీ పాలకులు రివర్స్ టెండరింగ్‌తో రైతులకు ప్రయోజనం శూన్యమన్నారు. టీడీపీ కూటమి రాకతో ఇప్పటికే కొంతమేరకు రైతులకు సహాయం అందించినట్లు చెప్పారు. అయితే ఖరీఫ్‌కు చేరేలోగా నియోజకవర్గానికి అనుకూలంగా ఉన్న ఐదు ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయాల్సి ఉన్నట్లు చెప్పారు. ఇవి సాధారణ స్థితికి చేర్చితే పట్టణానికి కూడా తాగునీరు అందించవచ్చని చెప్పారు. ఈ క్రమంలో ఆయా మరమ్మతులకు నిధులు కేటాయించి రైతులకు సహకరించాలని కొండయ్య అసెంబ్లీలో మాట్లాడారు.

తీరనున్న తాగునీటి సమస్యలు

నియోజకవర్గం ప్రజలకు ఇకపై తాగునీటి సమస్యలు ఉండవని ఇది శుభ పరిణామమని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. చీరాలలో తాగునీటి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూలంగా స్పందించి బుధవారం జలజీవన్ మిషన్ ద్వారా చీరాల పరిధిలో 18 వర్క్‌లకు రూ.6.10 కోట్లు, వేటపాలెంలో 16 వర్క్‌లకు రూ.4.62 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

బోగస్ మస్టర్‌లు వేస్తే కఠిన చర్యలు

- డ్వామా పీడీ విజయలక్ష్మి
- మూడు గ్రామాలలో ఉపాధి పనుల తనిఖీ
- కొద్ది రోజులుగా సిబ్బందిపై ఆరోపణలు



ఉప్పుమాగులూరులో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న పీడీ విజయలక్ష్మి

బల్లికురవ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న పనులకు రాకుండా వచ్చినట్లు బోగస్ మస్టర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ విజయలక్ష్మి హెచ్చరించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ఇటీవల పెద్ద ఎత్తున బోగస్ మస్టర్లు వేయాలని ఉపాధి సిబ్బంది క్షేత్ర సహాయకులపై ఒత్తిడి తెస్తున్నారని వచ్చిన వార్తలు, మస్టర్ల విషయమై సిబ్బంది మధ్య వాదనలు చోటు చేసుకున్నాయి ఈ పరిస్థితుల్లో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాల మేరకు రెండు రోజుల కిందట బల్లికురవ మండలానికి స్టేట్ విజిలెన్స్ అధికారులు వచ్చి సిబ్బందిని విచారించారు. వారి ఇచ్చిన నివేదికల మేరకు బుధవారం మండలం ఉప్పుమాగులూరు, బల్లికురవ గ్రామాలకు పీడీ, కూకట్లపల్లి గ్రామానికి జిల్లా విజిలెన్స్ అఫీసర్ శోభన్ వచ్చి కూలీలు చేస్తున్న పనులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈసందర్భంగా మూడు గ్రామాలలో క్షేత్ర సహాయకుల వద్ద ఉన్న ఫోన్లను నిలుపుదల చేసి మస్టర్‌లను చెక్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడైనా కూలీలు పనులకు రాకుండా వచ్చినట్లు మస్టర్ వేస్తే క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవన్నారు. అలానే ఉపాధి పనులను పర్యవేక్షించే సిబ్బంది ప్రతి రోజూ పనులను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా పనులలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పీడీ అన్ని గ్రామాల క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు లక్ష్యం మేరకు కూలీలకు పనులు కల్పించాలన్నారు. రోజు కూలి రూ.300 తగ్గకుండా పనులు చేయాలన్నారు. సిబ్బంది నగదు కోసం ఒత్తిడి తెస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఒక్కో గ్రామంలో 15 ఫారం పాండ్సను ఏర్పాటు చేయాలని పీడీ సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమకుమారి, ఏపీడీ కోటయ్యానాయక్ పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్ పోటీల్లో విన్నర్స్‌గా సెయింట్ ఆన్స్ విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ వాలీబాల్ పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్‌కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎస్‌ఆర్‌ఎం అమరావతి యూనివర్సిటీ వారు నిర్వహించిన పోటీల్లో సుమారు 25 జట్లు పోటీల్లో ఉండగా, వారితో తలపడి విజయం సాధించి రూ.30వేల నగదు బహుమతి సాధించారు. ఈక్రమంలో బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, అన్నం శ్రీనివాసరావు, మేనేజర్ ఆర్వి రమణమూర్తి, సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

8 నుంచి పీ-4పై సర్వే



ఎంపీడీవో కార్యాలయంలో పీ4 సర్వేపై సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి అనంతరాజు

పంగులూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదలను గుర్తించి వారిని ఆర్థికంగా శక్తిమంతులను చేసేందుకు ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన పీ-4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్ షిప్) కార్యక్రమంపై ఈ నెల 8 నుంచి 18 వరకు గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తెలిపారు. పీ4 కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో స్వరూపారాణి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సంద్భంగా అనంతరాజు మాట్లాడుతూ సిబ్బంది గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి సర్వేచేయాలన్నారు. ఈ సర్వే ద్వారా ప్రధానంగా ధనవంతులు, పేదలను గుర్తించడంలో స్పష్టమైన అవగాహన వచ్చేలా నిర్వహించాలన్నారు. నిజమైన పేదలను గుర్తించి వారికి ప్రభుత్వం అమలు చేసే పథకాలు అందేలా చూడడం పీ4 ఉద్దేశమన్నారు. పట్టణంలో ఇంటి స్థలం ఉన్నా, పది ఎకరాల పొలంఉన్నా, కారు, ఫ్యాన్, టీవీ, ఫ్రిజ్ కలిగి ఉన్నవారిని ధనవంతులుగా గుర్తించాలని సూచించారు. ఇవేవీ వారినే పేదలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలరాజేశ్వరి, ఈవోఆర్డీ సుమంత్, పీఆర్ హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కె.హనుమంతరావు, కిషోర్‌కుమార్, శివయ్య, ఎంఈవో వీరాంజనేయులు, ఏపీఎం జ్యోతి ప్రసాద్, ఏపీవో సంతోషం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాసరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలి

బల్లికురవ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా సిబ్బంది గ్రామాలలో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల డ్రాప్ బాక్స్‌లు, పాఠశాలల సోషల్ ఆడిట్‌లపై పలు సూచనలు చేశారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి విద్యాశాఖలో నూతన మార్పులు జరుగుతాయని విద్యార్థులకు అన్ని వసతులను అందిచేలా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో ఎఎల్ఎస్ కోర్డినేటర్ సాగర్, ఎంఈవో రమేష్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు సింగయ్య మృతి

అవినీతిపై సమాచార హక్కు చట్టం అస్త్రంతో యుద్ధం



సింగయ్య (ఫైల్)

అన్నంబొట్లవారిపాలెం (పర్చూరు), మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టమే అస్త్రంగా అవినీతిపై పోరాటం చేసిన అలుపెరగని యోధుడు చెన్నుపాటి సింగయ్య(86) బుధవారం మృతి చెం దారు. పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన సింగయ్య తెలుగుదేశం మండలపార్టీ అధ్యక్షుడిగా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన చివరి వరకు పనిచేసి అక్రమార్కులకు సింహ స్వప్నంగా నిలిచారు. ఎక్కడ అవినీతి జరిగినా అక్కడ సింగయ్య దర్శనం ఇచ్చేవారు. వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో జలయజ్ఞంలో జరిగిన అవినీతికి వ్యతిరేకంగా సింగయ్య హైకోర్టులో న్యాయపోరాటం చేశారు. అప్పట్లో ఈవిషయం సంచలనంగా మారింది. గత జగన్‌రెడ్డి పాలనలో రహస్య జీవోలు, తదితర అంశాలపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసి వైసీపీ పాలకులకు సంహ స్వప్నంగా మారారు. సమాజంలో ఎక్కడ అవినీతి జరిగినా దానిపై పోరాటం చేయడం ఆయన నైజం. ఎలాంటి లాభాపేక్ష లేకుండా తన సొంత ఖర్చులు పెట్టుకొని హైకోర్టులను ఆశ్రయించేవారు. సింగయ్య మరణం పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మజ్జిగ పంపిణీ అభినందనీయం



కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వేసవిని దృష్టిలో పెట్టుకొని దాతలు మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమని ఎంఈవో రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో దాతలు కాకర్ల యజ్ఞనారాయణ, పోపూరి శ్రీను విద్యార్థులకు పరీక్షలు ము గిసే వరకూ మజ్జిగను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఎం ఈవో రమేష్ ప్రారంభించగా హెచ్ఎం రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వినతి

మార్టూరు, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలపరిష్కారం చేయాలని కోరుతూ బుధవారం తహసీల్దారు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు తహసీల్దార్ టి ప్రశాంతికి వినతి పత్రం అందచేశారు. ఆ వినతిపత్రంలో స్వామినాథన్ కమిషన్ రిపోర్టు ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం ధర పెంచి చట్టబద్ధం చేయాలని, రైతుల అప్పులు రద్దు చేయాలని, వైసీపీ హయాంలో చేసిన రీసర్వే లోపాలను సరిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, గాడిపర్తి శివనాగేశ్వరరావు, తిరువీధుల భిక్షాలు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రద్రం చేయాలి

చినగంజాం, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలు తమ డిమాండ్ల సాధన కోసం గురువారం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్ కుమార్ కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశాలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌ఎన్ కే.స్వర్ణలతకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ ఆదిలక్ష్మి, సాయిసరస్వతి, బి.శారమ్మ, కే.రోహిణి, బి.జయమ్మ, ఎం.రాములమ్మ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గ్రానైట్ కార్మికుడి మృతి

మార్టూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రానైట్ పరిశ్రమలో కార్మికుడు జారిపడి తలకు రాయి తగలడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన సంపత్‌కుమార్ యాదవ్ (25) మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బుధవారం అతని మృతదేహానికి శవ పంచనామా చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించారు. అనంతరం అంబులెన్స్‌లో మధ్యప్రదేశ్‌కు తరలించారు. యాదవ్ సహచరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు.

పోస్టుమార్టం పూర్తి

మార్టూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో మంగళవారం ఉదయం కొమ్మినేనివారిపాలెం, రామకూరు గ్రామాల మధ్య రోడ్డుపక్కన ప్రాణాలు పోగొట్టుకున్న మురకొండ సిసింద్రి అలియాస్ చిట్టిబాబు మృతదేహానికి బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన చిట్టిబాబు ద్విచక్రవాహనంపై వస్తూ ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన మట్టికాలువలో పడి ప్రాణాలు పోగొట్టుకున్న విషయం విదితమే. అతని భార్య వెంకట శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ సైదా తెలిపారు.

నేడు మద్యం దుకాణానికి డ్రా

పర్చూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇంకొల్లు మండలంలో గౌడ కులస్థులకు కేటాయించిన మద్యం దుకాణానికి డ్రా జరుగనుంది. గురువారం ఉదయం 8గంటలకు బాపట్ల కలెక్టరేట్ ఆవరణలో పీజీఆర్ఎస్ హాలులో డ్రా తీయడం జరుగుతుందని ఆ శాఖ సీఐ భుజంగరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. షాప్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు తప్పక పత్రాలతో హాజరు కావాలని కోరారు.